ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

కుమరం భీం
జిల్లా వార్తలు
6
బుధవారం 4 డిసెంబరు 2024

జిల్లాలో సమగ్ర ఇంటింటి సర్వే పూర్తిచేయడంతో స్థానిక సంస్థల ఎన్నికలపై ఆశావహులు దృష్టి సారించారు. ఇటీవల చేపట్టిన ఇంటింటి సర్వే పూర్తి కావడంతో రిజర్వేషన్ల అంశం తేలనుందని భావిస్తున్నారు. ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం కసరత్తు ప్రారంభించడంతో ఆశావహులు ప్రజలకు చేరువయ్యేందుకు యత్నిస్తున్నారు.



త్వరలో స్థానిక సమరం

- గ్రామాల్లో ఆశావహుల సందడి
- పూర్తి చేసిన సమగ్ర సర్వే
- రిజర్వేషన్లకు ఎదురుచూపు
- జిల్లాలో 335 గ్రామపంచాయతీలు

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలో కులగణన సర్వే పూర్తయింది. ఏ కులాలు ఎంత అనేది ఇంకా వివరాలు వెల్లడి కాలేదు. కాగా అత్యధిక కుల వ్యక్తుల వివరాలపై రాజకీయ నాయకులు వివరాల సేకరణలో నిమగ్నమయ్యారు. వాస్తవానికి జిల్లాలో ఎస్సీ, బీసీ ఓటర్లు అత్యధికంగా ఉన్నందున ఆ సామాజిక వర్గాలను తమ వైపు తిప్పుకునేందుకు వివిధ పార్టీల నాయకులు యత్నిస్తున్నారు. ఎన్నికల సంబరం ఇంకా ప్రారంభం కానప్పటికీ వివిధ పార్టీల నాయకులు పలు రకాల కార్యక్రమాల పేరుతో ఉనికి చాటుకునేందుకు తమదైన శైలిలో ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ఆయా గ్రామాలలో చనిపోయిన వ్యక్తుల కుటుంబాలను పరామర్శించడం, శుభకార్యాలకు వెళుతూ ప్రజల దృష్టిలో పడేందుకు పాట్లుపడుతున్నారు.

అధికారుల కసరత్తు..

సర్పంచ్ ఎన్నికలకు త్వరలో నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉండడంతో అధికార యంత్రాంగం దీనిపై కసరత్తు ప్రారంభించింది. ఇది వరకే పంచాయతీలు, వార్డుల వారీగా ఓటరు జాబితా సిద్ధం చేశారు. బ్యాలెట్ పేపర్ల తయారీకి సైతం చర్యలు తీసుకుంటున్న చెబుతున్నారు. జిల్లాకు అవసరమైన బ్యాలెట్ బాక్సులను ముందస్తుగానే సిద్ధంగా ఉంచారు. ఈనెల 7న పోలింగ్ స్టేషన్ల డ్రాఫ్ట్ నోటిఫికేషన్, 17న పోలింగ్ స్టేషన్ల తుది జాబితాను ప్రచురించనున్నారు. కాగ ఈనెల 10న జిల్లా స్థాయి, 12న మం డల స్థాయిలో రాజకీయ నాయకులతో సమావేశాలు నిర్వహించనున్నారు.

రంగంలో నిలిచేందుకు..

సర్పంచ్ ఎన్నికల్లో పోటీ పడేందుకు పెద్ద సంఖ్యలో ఆశావహులు వేచి చూస్తున్నారు. ఇటీవల రిజర్వేషన్ల అంశం తేల్చేందుకు ప్రభుత్వం కుల గణన సర్వే పూర్తి చేయించింది. దీంతో మరికొన్ని రోజుల్లోనే నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉండడంతో ఆశావహులు దీనిపై దృష్టి సారించారు. రాష్ట్రంలో పదేళ్ల అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వ కొలువుదీరింది. దీంతో ఇన్నాళ్లు పదవి దక్కించుకోలేక పోయిన ద్వితీయ, తృతీయశ్రేణి నాయకులు ఈ సారి పోటీలో నిలిచి గెలిచేందుకు క్షేత్రస్థాయిలో పని చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల బరిలో నిలిచే వ్యక్తికి అధిక సంతానం నిబంధన ఎత్తివేయడంతో పోటీ ఎక్కువగా ఉండే అవకాశం ఉందని చెబుతున్నారు. గతంలో ముగ్గురు సంతానం ఉన్నవారు పోటీ కి అనర్హులుగా ఉంది. దీంతో చాలా మంది పోటీకి దూరంగా ఉన్నారు. ఆ నిబంధనలను ఎత్తివేయ డంతో ఆశావహులు మరింత మంది పెరుగనున్నారు.

15 మండలాల పరిధిలో..

జిల్లాలోని 15 మండలాల్లో 335 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. జిల్లాలో ఇటీవల జరిగిన కుల గణన ప్రక్రియ పూర్తి కాగానే అందరి దృష్టి పంచాయతీ ఎన్నికలపై దృష్టి సారిస్తున్నారు. సర్వేకు సంబంధించిన డేటా ఎంట్రీ ప్రక్రియ మరో రెండు, మూడు రోజుల్లో పూర్తయ్యే అవకాశం ఉంది. కులగణన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలనే డిమాండ్లు వెల్లువెత్తడంతో ప్రభుత్వం కులగణన సర్వే చేపట్టింది. కులాల వారీగా జనాభా లెక్కలు వెల్లడికానున్నాయి. వీటి ఆధారంగా ప్రస్తుతమున్న రిజర్వేషన్లను సవరించి కొత్తగా జారీ చేయనున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 1వ తేదీతో సర్పంచుల పదవీకాలం ముగిసి పోవడంతో ప్రత్యేకాదికారుల పాలన కొనసాగుతుంది. పాలకవర్గాలు లేకపోవడంతో పల్లెలకు సంబందించిన తీర్మాణాలు లేకపోవడంతో కేంద్రం నుంచి వచ్చే నిధులకు అటంకాలు ఎదురవుతు న్నాయి. ఈ క్రమంలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని గతంలోనే ప్రభుత్వం బావించినప్పటికి కులాల జనాభా లెక్కలు తీయాలని డిమాండ్లు వినిపించడంతో ప్రభుత్వం వెనక్కి తగ్గింది. తాజాగా సర్వే పూర్తికావడంతో ఈ నెలలోనే ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉంది.

ఎన్నికల నిర్వహణకు సిద్ధం..

- భిక్షపతిగౌడ్, జిల్లా పంచాయతీ అధికారి



రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వ హణకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నాం. ఇది వరకే పంచాయతీలు, వార్డుల వారీగా ఓటరు జాబితా సిద్ధం చేశారు. జిల్లాకు అవసరమైన బ్యాలెట్ బాక్సులను సైతం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటు న్నాం. ఈనెల 7న పోలింగ్ స్టేషన్ల డ్రాఫ్ట్ నోటిఫికేషన్, 17న పోలింగ్ స్టేషన్ల తుది జాబితాను ప్రచురిస్తాం.

కంకాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



మొక్కులు చెల్లించుకుంటున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు, ఎమ్మెల్సీ దండె విఠల్

కౌటాల, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కౌటాల మండల కేంద్రంలోని కంకాలమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఎమ్మెల్సీ దండె విఠల్, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను శాలువాలతో సత్కరించారు. వారి వెంట ఆలయ కమిటీ అధ్యక్షుడ కనకయ్య, ఎ.రాజేందర్‌గౌడ్, మల్లయ్య, మోతిరాం, వాను పటేల్, మిథున్, కవిరాజ్, సత్తయ్య, తిరుపతిగౌడ్, అశోక్, చందు, తిరుపతి, నానా జీ, వెంకటేష్, భూమన్న, రవి, బాబురావు, శ్రీకాంత్, శ్రీను పాల్గొన్నారు.

'వందశాతం రుణమాఫీ చేయలేదు'

కౌటాల, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం నూరు శాతం రుణ మాఫీ చేయలేదని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు ఎద్దేవా చేశారు. మంగళవారం కౌటాల మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కౌటాల మండలం ముత్యంపేట గ్రామీణ బ్యాంకులో 40 శాతం మందికి కూడ రుణ మాఫీ కాలేదని చెప్పారు. సీఎం సొంత గ్రామం కొండారెడ్డిపల్లెలో కూడా పూర్తి స్థాయిలో రుణ మాఫీ కాలేదని నిరూపించడానికి తాము సిద్ధమని తెలిపారు.

నేరాల నియంత్రణకే కార్డన్‌సెర్చ్

పెంచికలపేట, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకే కార్డన్‌సెర్చ్ నిర్వహిస్తున్నామని ఎస్సై కొమురయ్య అన్నారు. మండలంలోని ఆగర్‌గూడ గ్రామంలో మంగళవారం ఉదయం కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. గ్రామంలోకి ఎవరైనా అనుమానిత వ్యక్తుల వస్తే పోలీసులకు సమాచారం అందివ్వాలని సూచించారు. అసాంఘిక శక్తులకు ఆశ్రయం కల్పించవద్దని అన్నారు. వాహనదారులు సరైన పత్రాలు కలిగి ఉండాలని చెప్పారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. పులి సంచారం నేపథ్యంలో చేను పనులకు వెళ్లే వారు జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. ఆయన వెంట పోలీస్‌సిబ్బంది ఉన్నారు.

బూత్‌స్థాయి సహాయకుల జాబితా అందించాలి

ఆసిఫాబాద్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక ఓటరు జాబితా సవరణకు రాజకీయ పార్టీలు తమ బూత్ స్థాయి సహాయకుల జాబితాను అందించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవనంలోని సమాదేశ మందిరంలో అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌రావులతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక ఓటరు జాబితా సవరణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో భాగంగా వచ్చిన దరఖాస్తులను ఈ నెల 24 లోగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. జనవరి 6న తుది జాబితాలో ప్రచురిస్తామని తెలిపారు. స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించడానికి రాజకీయ పార్టీలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రతిభ చాటాలి

ఆసిఫాబాద్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చాటాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవనంలోని కలెక్టర్ చాంబర్‌లో మంగళవారం రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో గిరిజన క్రీడా పాఠశాల విద్యార్థులు ఓవరాల్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొని విజేతగా నిలవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గిరిజనాభివృద్ది అధికారి రమాదేవి, క్రీడల అభివృద్ధి అధికారి మీనారెడ్డి, శిక్షకులు రవి, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్య బోధించాలి

లింగాపూర్ డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలని మండల విద్యాధికారి యం శ్రీనివాస్ అన్నారు. మండలంలోని నాగూగుడా, జాముల్‌ధర, ఘూంనూర్ పాఠశాలలను మంగళవారం ఎంఈవో పరిశీలించారు. ఉపాధ్యాయులు కనీస విద్య సామర్థ్యాలను పెంపొందించేందుకు పాటుపడాలని చెప్పారు. ఆయన వెంట ఉపాధ్యాయుడు కైలాస్ తదితరులు ఉన్నారు.

9న ప్రజాపాలన విజయోత్సవాలు

జైనూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా ఈ నెల 9వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన విజయోత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ, డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌రావ్ అన్నారు. స్థానిక మార్కెట్ కమిటీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ప్రజాపాలన సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. జైనూర్, సిర్పూర్ (యు), లింగాపూర్ మండలాల కార్యకర్తలు, నాయకులు, అభిమానులు, పార్టీ శ్రేణులు తప్పక హాజరు కావాలని వారు కోరారు. సమావేశంలో జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

'హెచ్‌ఎంను సస్పెండ్ చేయాలి'

ఆసిఫాబాద్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కౌటాల మండలం మొగడ్‌దగడ్ ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎంను సస్పెండ్ చేయాని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఏవోకు వినతి పత్రం అందజేశారు. కుళ్లిన కోడిగుడ్లు, పాడైన కూరగాయలు, నీళ్ల సాంబరుతో భోజనం పెడుతున్న ప్రధానోపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో నా యకులు కార్తీక్, టీకానంద్, దినకర్, శ్రావణి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మెనూ పాటించాలి

కెరమెరి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కేజీబీవీలో మెనూ పాటించాలని ఎంపీడీవో అంజద్‌పాషా అన్నారు. మంగళవారం కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని చెప్పారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉండాలా సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎస్‌వో ప్రవీణ తదితరులు ఉన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం సమీపంలోని కేస్లాపూర్ ఆంజనేయ స్వామిని మంగళవారం ఆసిఫాబాద్ సీఐ బుద్దే రవీందర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీఐని ఆలయ కమిటీ సభ్యులు గణపతి, సంతోష్, శ్రీనివాస్, గురుమూర్తి, అర్చకులు శిరీష్‌శర్మ, శ్రీనివాస్ శర్మ తదితరులు సన్మానించారు.

మున్సిపాలిటీల అభివృద్ధిపై దృష్టి



పారిశుధ్య కార్మికుడిని సన్మానిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మున్సిపాలిటీల అభివృద్ధిపై దృష్ట సారించామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆసిఫాబాద్ మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ భుజంగరావుతో కలిసి పా ల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా పారిశుధ్య కార్మికులను సన్మానిచారు. పారిశు ధ్యంపై చేపట్టిన అవగాహన ర్యాలీలో అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి బస్టాండు ఏరియాలో గల అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో లీడ్ డిస్ట్రిక్ మేనేజర్ రాజేశ్వర్ జోషి, మెప్మా ప్రాజెక్టు అధికారి మోతిరాం, బ్యాంకు మేనేజర్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్: పట్టణంలో మంగళవారం ప్రజాపాలన విజయోత్సవ సంబరాల కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక రాజీవ్ గాంధీ చౌరస్తా నుంచి ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంల అదనపు కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంబరాలు జరుపుకుంటున్నట్లు వివరించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ అంజయ్య, తహసిల్దార్ కిరణ్, ఆయా శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏం చేశారని విజయోత్సవాలు



కరపత్రాలను విడుదల చేస్తున్న బీజేపీ నాయకులు

ఆసిఫాబాద్ రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు ఏం చేశారని విజయోత్సవాలు జరుపుకుంటున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం మాజీ జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, మాజీ ఎంపీపీ మల్లికార్జున్‌లతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం కాంగ్రెస్ 6 అబద్దాలు, 66 మోసాలతో గ్యారెంటీల గారడీ కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో నాయ కులు విశాల్, అరుణ్, ప్రసాద్‌గౌడ్, పెంటయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఏడాదిలో అభివృద్ధి చేసింది శూన్యం

కాగజ్‌నగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలన ఏడాదిలో చేసిన అభివృద్ధి శూన్యంగా ఉందని సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు అన్నారు. మంగళవారం ఏడాది పాలనపై పోస్టర్లను విడుదల చేశారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొంగ సత్యనారాయణ, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ కాళిదాస్ మజుందార్, జిల్లా ప్రధాన కార్యదర్శి దోని శ్రీశైలం, జిల్లా కోశాధికారి అరుణ్ లోయా, పట్టణ అధ్యక్షులు సిందం శ్రీనివాస్, మాజీ ఎంపీపీ కొప్పుల శంకర్, గజ్జల లక్ష్మణ్, రమేష్, సమీర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.


రాజ్యాధికారమే లక్ష్యంగా ముందుకు సాగాలి

బెజ్జూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాజ్యాధికారమే లక్ష్యంగా ముదిరాజులు ముందుకు సాగాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలేంద్ర శివయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల చేపట్టిన కుల గణనకు సంబందించిన వివరాలను వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో బహిర్గతం చేయాలని కోరారు.

గిరిజనుల అభివృద్ధికి కృషి

కాగజ్‌నగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నట్లు తెలంగాణ గిరిజన కోఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ కొట్నాక తిరుపతి తెలిపారు. మంగళవారం కాగజ్‌నగర్‌లోని జీసీసీ కేంద్రాన్ని పరిశీలించారు. కాగజ్‌నగర్‌లోని జీసీసీ కార్యాలయంలో రెండు రోజుల క్రితం గోడౌన్ నుంచి సరుకులతో వ్యాన్ తరలింపు వివాదంపై డీఎం రామనాథంను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఆందోళన



కాగజ్‌నగర్‌లో ఆందోళన చేస్తున్న ఆశా కార్యకర్తలు

కాగజ్‌నగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆశా వర్కర్లకు వేతనాలతో పాటు పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. అనంతరం వైద్యాధికారికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ పాల్గొన్నారు.

బెజ్జూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పెండింగ్ బకాయిలు చెల్లించాలని మం గళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట మంగళవారం ఆశా కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో సరోజన, సునీత, నాగమణి, పార్వతి, వైశాలి తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధిహామీ'లో నిధుల దుర్వినియోగం

- ప్రజావేదికలో అధికారుల వెల్లడి
- రికవరీకి డీఆర్‌డీవో ఆదేశాలు



ప్రజావేదికలో మాట్లాడుతున్న డీఆర్‌డీవో దత్తారాం

వాంకిడి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన నిధుల్లో నిధులు దుర్వినియోగమైనట్లు అధికారులు వెల్లడించారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో 2023-24 సంవత్సరంలో చేపట్టిన ఉపాధిహామీ పనులపై మంగళవారం ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని 28 గ్రామ పంచాయతీలలో చేసిన పనులపై డీఆర్పీలు ఇటీవల చేసిన తనిఖీ చేశారు. ఈ మేరకు రూ. 10,97,702 లక్షలు దుర్వినియోగం జరిగినట్లు ఎస్‌ఆర్‌పీ బెజ్జంకి తిరుపతి వెల్లడించారు. పలు గ్రామాల్లో పర్కులేషన్ ట్యాంక్‌లు నిర్మించినా వర్షాకాలంలో అవి కొట్టుకుపోవడం, మరి కొన్ని గ్రామాల్లో కుంటలను చదును చేసి రైతులు వ్యవసాయ పంటలు పండించడంతో నిధులు దుర్వినియోమైన ట్లు తనిఖీ బృందం చెప్పింది. బినామి పేర్లతో కూలీల డబ్బులు కాజేయడం, అర్హులైన వారికి జాబ్‌కార్డులు ఇవ్వక పోవడం, కూలీలకు ఇవ్వాల్సిన డబ్బులు కొంత మంది మేట్‌లు సొంతంగా వాడుకోవడం లాంటి విషయాలు తనిఖీ బృందం అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. డీఆర్‌డీవో దత్తారాం మాట్లాడుతూ ఉపాధి హామీపథకంలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. పనులు ప్రజలకు, రైతులకు ఉపయోగ పడేలా ఉండాలని ప్రజలకు అవసరమైన పనులను మాత్రమే చేపట్టాలని డీఆర్‌డీవో దత్తారాం అన్నారు. మండలంలో చేపట్టిన పనులపై టీఏ, ఎఫ్‌లు నిర్లక్ష్యంగా వ్యవహరించడంవల్ల పనులు ఉపయోగకరంగా లేకుండా పోయాయన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో నిర్మించిన పర్కులేషన్ ట్యాంక్‌లను రైతులు చదును చేసి పత్తి పంటలు పండించారని దీంతో లక్షల రూపాయలు వృధా అయ్యాయని తెలిపారు. ఎవరైతే రైతులు పీటీ ట్యాంకులను చదును చేసి పత్తి పంటలు వేశారో వారికి నోటీసులు జారీ చేసి రికవరీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఉపాధిహామీ నిధుల దుర్వినియోగానికి పాల్పడిన టీఏ, ఎఫ్‌ఏ, కార్యదర్శులకు రూ. 58 వేలు జరిమానా విధించామని వివరించారు. దుర్వినియోగ మైన నిధులను సంబంధిత టీఏ, ఎఫ్‌ఏ, కార్యదర్శుల ద్వారా రికవరి చేయనున్నట్లు చెప్పారు. ప్రతి ఒక కూలీకి పని కల్పించేలా చూడాలన్నారు. బినామి పేర్లపై కూలీ డబ్బులు తీసుకున్న మేట్లపై చర్యలు తీసుకుం టామని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్ మల్లేషం, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఈజీఎస్ ఏపీఎం శ్రావణ్, పీఏసీఎస్ చైర్మన్ జాబిరె పెంటు, ఎస్‌ఆర్‌పీ తిరుపతి, ఉపాధిహామీ సిబ్బంది, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

సిర్పూర్(టి), డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): సిర్పూర్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తామని ఎమ్మెల్సీ దండె విఠల్, ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. మండల కేంద్రంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను మంగళవారం పంపిణీ చేశారు. ఎమ్మెల్యే హరీష్‌బాబు మాట్లాడుతూ ప్రాణహిత ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం 60 శాతం నిధులు ఇవ్వడానికి సిద్ధంగా ఉందని చెప్పా రు. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది ఆలస్యం చేసిందని చెప్పారు. ఎమ్మెల్సీ దండె విఠల్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాదిలో పలు సంక్షేమ పథకాలు అమలు చేసిందని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో సత్యనారాయణ, నాయకులు గణపతి, హర్షద్ హుస్సేన్, ఈర్ల సత్యనారాయణ, సోహెల్ అహ్మద్, తులసీరాం, ప్రవీణ్, అశోక్, సత్యనారాయణ, నానయ్య పాల్గొన్నారు.

కౌటాల: మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ పుష్పలత, ఏవో ప్రేమలత, నాయకులు రాజేందర్‌గౌడ్, మల్లయ్య, మోతిరాం, వాను పటేల్, మిథున్, కవిరాజ్, సత్తయ్య, బండురావు, సదన్‌రెడ్డి, నానా వెంకటేష్, సత్తయ్య, తిరుపతిగౌడ్, అశోక్, చందు తదితరులు పాల్గొన్నారు

శ్రీకాంతాచారి వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలి

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలు అర్పించిన శ్రీకాంతాచారి వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని విశ్వబ్రాహ్మణ (విశ్వకర్మ) ఐక్య సంఘం నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ఆవరణలో మంగళవారం శ్రీకాంతచారి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

ఏఈవోపై ఫిర్యాదు

పెంచికలపేట, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): గతంలో నిర్వహించిన పంట నష్టం సర్వే పారదర్శకంగా జరగలేదని మంగళవారం ఎమ్మెల్సీ దండె విఠల్‌కు స్థానిక కాంగ్రెస్ నాయకుడు ఫిర్యాదు చేశారు. క్షేత్ర పర్యటన చేయకుండా పంట నష్ట పోయిన రైతు లకు కాకుండా ఇష్టానుసారంగా సర్వే నిర్వహించిందని తెలిపారు. దీంతో రైతులకు అన్యా యం జరిగిందని కాంగ్రెస్ నాయకుడు కృష్ణ చెప్పారు. ఈ విషయమై ఉన్నతాదికారులకు ఎమ్మెల్సీ సిఫారసు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

మహిళలు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

కాగజ్‌నగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మహిళ శక్తి రుణాలను అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలనిని ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు తెలిపారు. మంగళవారం మున్సిపాల్టీ కార్యాలయంలో మహిళ శక్తి రుణాల కింద మంజూరైన చెక్‌లను అందజేశారు కార్యక్రమంలో కమిషనర్ అంజయ్య, టీఎల్‌ఎఫ్ అధ్యక్షురాలు సునిత తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఎస్టీపీపీలో కాంట్రాక్టు కంపెనీ అధికారి ఆత్మహత్య

జైపూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఎస్టీపీపీలోని ఎఫ్‌జీడీ నిర్వహణ పనులు చేపడుతున్న పీఈఎస్ ఇంజనీర్స్ ప్రైవేటు లిమిటెడ్‌లో సీనియర్ జీఎంగా పనిచేస్తున్న బొబ్బ తిరుపతిరావు(56) మంగళవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణ జిల్లా గన్నవరం మండలం ముస్తాబాద్ గ్రామానికి చెందిన తిరుపతిరావు ఎస్టీపీపీలో విధులు నిర్వహిస్తున్నాడు. క్వార్టర్ నెంబర్ ఎంబీ 6/10లో ఒంటరిగా నివాసం ఉంటున్నాడు. రెండు సంవత్సరాల నుంచి కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. మంగళవారం ఉదయం క్వార్టర్‌లో ఉరివేసుకుని మృతిచెందగా సమీపంలో ఉన్న వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి తమ్ముడు శ్రీనివాస్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీధర్ పేర్కొన్నారు. మృతుడికి ఇద్దరు భార్యలు కాగా ఒకరు అనారోగ్యంతో మృతి చెందగా మరొకరు ఆయనకు దూరంగా ఉన్నట్లు పేర్కొన్నారు. మృతుడికి కుమారులు, కుమార్తెలు ఉన్నారని వారు విదేశాల్లో ఉద్యోగ రీత్యా స్థిరపడినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి


రమేష్ (ఫైల్)

చెన్నూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పెద్ద చెరువులో పూల కోసం వెళ్లి వ్యక్తి మృతిచెందాడు. బట్టిగూడెం కాలనీకి చెందిన పందుల రమేష్(40) మంగళవారం ఉదయం తామరపూల సేకరణ కోసం పెద్ద చెరువులోకి వెళ్లాడు. చెరువులోని చెట్ల వేర్లలో కాళ్లు ఇరుక్కుని నీటిలో మునిగి మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు చెరువులో దిగి రమేష్ మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రవీందర్ పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడి మృతి


సూర్య కిరణ్ (ఫైల్)

కోటపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : లక్ష్మీపూర్ గ్రామం వద్ద బైక్‌పై వెళ్తున్న సూర్యకిరణ్ (25) అనే యువకుడిని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సిరొంచ నుంచి ఆర్టీసీ బస్సు చెన్నూరుకు వెళ్తుంది. లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన సూర్యకిరణ్ సిరొంచ మార్గంలో బైక్‌పై వెళ్తున్నాడు. మార్గమధ్యలో లక్ష్మీపూర్ పెట్రోలు బంక్ వద్ద పశువులు అడ్డురావడంతో బైక్‌పై ఉన్న సూర్యకిరణ్ అదుపు తప్పి కిందపడ్డాడు. అదే సమయంలో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు సూర్యకిరణ్‌ను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి


చంద్రమౌళి (ఫైల్)

భీమారం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఐటీడీఏ కాలనీలో మంగళవారం ఉదయం విద్యుత్ షాక్‌తో పప్పు చంద్రమౌళి (53) మృతి చెందాడు. కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం వెల్ది గ్రామానికి చెందిన చంద్రమౌళి మూడు రోజుల క్రితం కూతురు ఇంటికి వచ్చాడు. మంగళవారం కింద ఉన్న సుమారు 20 ఫీట్ల ఇనుపరాడ్లను భవనంపైకి ఎక్కించేందుకు చంద్రమౌళి ఎదురింట్లో ఉన్న బాలుడు వంశీకృష్ణ సహాయం తీసుకున్నాడు. ఇద్దరు కలిసి మెట్ల ద్వారా భవనంపైకి తీసుకువెళ్తుండగా పక్కనే ఉన్న 11కేవీ విద్యుత్ వైర్లకు ఇనుపరాడ్‌లు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురయ్యారు. చంద్రమౌళికి తీవ్ర గాయాలు కాగా కుటుంబీకులు మంచిర్యాలలోని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. బాలుడు వంశీకృష్ణకు చేతులు, పొట్టకు గాయాలు కాగా స్థానికంగా చికిత్స అందించి మంచిర్యాలకు తరలించారు. మృతుడి అల్లుడు రామటెంకి రంజిత్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్వేత తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


సాగర్(ఫైల్)

కరీంనగర్ క్రైం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం మొగ్దుంపూర్ వద్ద రాజీవ్ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం పారిపల్లి గ్రామానికి చెందిన బోగె సాగర్(20) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. సాగర్ స్నేహితుడైన దండేపల్లి మండలం కన్నెపల్లికి చెందిన రాగుల శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సాగర్, శ్రీనివాస్‌లు మంచిర్యాల నుంచి కరీంనగర్ శివారులోని చల్మెడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బంధువులను చూసేందుకు మంగళవారం ఉదయం బైక్‌పై బయలుదేరారు. మొగ్దుంపూర్ స్కూల్ వద్దకు రాగానే ఇటుకబట్టీకి చెందిన లారీ రోడ్డు క్రాస్ చేస్తుండగా బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్ నడుపుతున్న సాగర్ అక్కడిక్కడే మృతి చెందగా, శ్రీనివాస్‌కు కరీంనగర్‌లో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.మృతుడు సాగర్ మంచిర్యాలలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కుమరం భీం ప్రాజెక్టులో దూకి వృద్ధుడి ఆత్మహత్య

ఆసిఫాబాద్ రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కుమరం భీం ప్రాజెక్టులో దూకి ఆడ గ్రామానికి చెందిన పెట్కులే భీంరావు(76) అనే వ్యక్తి మంగళవారం ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబీకులు తెలిపారు. భీంరావు కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నారు. మనస్తాపం చెందిన భీంరావు బహిర్భూమికి వెళ్లి ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో యువకుడి ఆత్మహత్య

చింతలమానేపల్లి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): గూడెం గ్రామానికి చెందిన మండిగ సాయి(23) అనే యువకుడు మద్యం మత్తులో తన ఇంటి సమీపంలోని పెరటిలో ఉన్న చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై నరేష్ తెలిపారు. సాయి భార్య భారతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ప్రియుడు మోసం చేశాడని యువతి ఆత్మహత్య


సాయిస్నేహిత (ఫైల్)

బెల్లంపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రియుడు మోసం చేశాడనే ఆవే దనతో యువతి ఉరి వేసుకుని ఆత్మహత్యచేసుకున్న ఘటన బెల్లంపల్లి పట్టణంలో చోటుచేసుకుంది. హనుమాన్ బస్తీకి చెందిన శేషగిరి-లత కుమార్తె సాయిస్నేహిత (24) పట్టణంలో బేకరీ నిర్వహిస్తున్న శ్రీనాథ్ కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. పెళ్లి చేసుకుందామని కోరగా శ్రీనాథ్ తప్పించుకు తిరుగుతున్నాడు. దీంతో మనస్తాపానికి గురై సోమవారం సాయంత్రం ఇంట్లో ఉరి వేసుకుంది. గమనించిన అక్క సాయి శ్వేత కిందకు దించి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో మంచిర్యాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో దేవయ్య తెలిపారు. తండ్రి శేషగిరి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. శ్రీనాథ్ బీఆర్‌ఎస్‌వీ నియోజకవర్గ అధ్యక్షుడిగా కొనసాగుతున్నాడు. అతడిని పార్టీ నుంచి తొలగించినట్లు బీఆర్‌ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు శ్రావణ్ ఒక ప్రకటనలో తెలిపారు.

మంత్రి పదవి కోసమే వివేక్ మాలల సభ

నస్పూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మాలల సింహగర్జన సభ కేవలం ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి మంత్రి పదవి కోసమేనని మాదిగ హక్కుల దండోరా (ఎంహెచ్‌డీ) జాతీయ అధ్యక్షుడు దండు సురేందర్ మాదిగ ఆరోపించారు. ప్రెస్ క్లబ్‌లో మంగళవారం రాష్ట్ర అధ్యక్షుడు కొంగరి శంకర్ మాదిగ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిలుక రాజనర్సులతో కలిసి మాట్లాడారు. 1వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించిన మాలల సభ మాలల ఆత్మ గౌరవం కోసం కాదన్నారు. రానున్న రోజుల్లో మాదిగ ఉప కులాలను ఐక్యం చేసి వివేక్ వెంకటస్వామి కుటుంబానికి తగిన గుణపాఠం చెబుతామని సురేందర్ హెచ్చరించారు. గుగ్గిల్ల అర్జున్, కోళ్ళ రమేష్, అర్కిల్ల దుర్గయ్య, కాంపెల్లి రాజం, రాజ్‌కుమార్, పాల్గొన్నారు.

చిన్నారుల ప్రతిభకు పోటీలు దోహదపడతాయి

మందమర్రి టౌన్, డిసెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు సాంస్కృతిక పోటీలు దోహదపడతాయని ఎస్సై రాజశేఖర్ తెలిపారు. సీఈఆర్ క్లబ్‌లో నిర్వహించిన నృత్య కళాకారుల అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా బాల కళోత్సవం ముగింపు సందర్భంగా బహుమతి ప్రధానానికి హాజరై మాట్లాడారు. క్రీడలతో పాటు సాంస్కృతిక పోటీల్లో పాల్గొనడంతో విద్యార్థుల్లో చురుకుదనం, క్రమశిక్షణ పెరుగుతుందన్నారు. సలేంద్ర సత్యనారాయణ, శ్రీనివాస్, రవిసాగర్, మూడారపు శేఖర్, రమేష్, గ్రాండ్ మాస్టర్ గోపి, పాల్గొన్నారు.

భర్తీ ఎప్పుడు..?

- ఖాళీగా అంగన్‌వాడీ టీచర్, ఆయా పోస్టులు
- పలుచోట్ల ఇన్‌చార్జిలే దిక్కు
- పనిభారంతో ఇబ్బందులు

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోస్టులు ఖాళీల భర్తీకి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదు. టీచర్, ఆయా పోస్టులను భర్తీ చేయకపోవడంతో ఆయా కేంద్రాల పరిధిలోని బాలింతలు, గర్భిణులు, పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్న కేంద్రాల నిర్వహణ బాధ్యతను పక్కన ఉన్న కేంద్రాల టీచర్‌కు అప్పగించడంతో వారిపై అదనపు పనిభారం పడుతోంది.



రెబ్బెన అంగన్‌వాడీ కేంద్రం

రెబ్బెన, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాల్లోనే సరిపడా సిబ్బంది లేక అవస్థలు తప్పడం లేదు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంతో పాటు శిశువులకు టీకాలు వేయడం, పోలియోను అరికట్టడంతో కీలక పాత్ర పోషించడం వంటి ప్రత్యేక కార్యక్రమాలను అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా నిర్వహిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కీలకమైన అంగన్‌వాడీ కేంద్రాల్లో అంగనావాడీ టీచర్లు, ఆయాల పోస్టులను ఏళ్ల తరబడి భర్తీ చేయడం లేదు. సమీపంలోని కేంద్రాల్లో పని చేస్తున్న టీచర్లకు అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నారు. దీంతో అంగన్‌వాడీ టీచర్‌పై అదనపు భారం పడడంతో పాటు కేంద్రాలకు వచ్చే వారికి మెరుగైన సేవలు అందడం లేదు.

● ఐసీడీఎస్ ఆధ్వర్యంలో..

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో వందల సంఖ్యలో ఉన్న ఖాళీలతో పిల్లలు, గర్భిణులు, బాలింతకు నష్టం జరుగుతోంది. జిల్లాలో ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, సిర్పూరు(టి), జైనూర్, వాంకిడి ప్రాజెక్టుల్లో మొత్తం 973 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ప్రతీ కేంద్రానికి ఒక టీచర్, కొహెల్పర్ ఉండాలి. 973 టీచర్ పోస్టులు, 271 ఆయా పోస్టులు ఇప్పటికీ ఖాళీగా ఉన్నాయి. ప్రభుత్వం నుంచి ఖచ్చితమైన ప్రకటన విడుదల కాకపోవటంతో భర్తీపై సందిగ్ధం నెలకొంది. వందల పోస్టులు ఖాళీగా ఉండడంతో దరఖాస్తు చేసుకునేందుకు నిరుద్యోగులు కూడా ఆశగా ఎదురు చూస్తున్నారు. జిల్లాలోని జైనూరు, సిర్పూరు(యు), కెరమెరి, తిర్యాణి, లింగాపూర్ ప్రాంతాల్లో ఆదివాసి గిరిజనులు అధికంగా ఉన్నారు. ఆయా మండలాల్లోని ఏజెన్సీ ప్రాంతాల్లో చదువుతున్న మహిళలు చాలా తక్కువ మంది ఉన్నారు. గత నిబంధనల ప్రకారం అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్, ఆయాగా పని చేయాలంటే స్థానికతను ఆధారంగా తీసుకునేవారు. వివాహం అనంతరం అంగన్ వాడీ కేంద్రం ఉన్న గ్రామానికి చెందిన వారై ఉండాలి. మారుమూల ఆదివాసీ గ్రామాల్లో చదువుకున్న మహిళలు తక్కువగా ఉండడంతో పోస్టులు భర్తీ కావడం లేదు. ఫలితంగా ఇన్‌చార్జీలతో నెట్టుకరావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం అంగన్వాడీ టీచర్‌గా పని చేయాలంటే కనీస అర్హత ఇంటర్‌తో నోటిఫికేషన్ విడుదల చేస్తారనే సమాచారం. విద్యార్హత కలిగి లేని గ్రామాల్లో భర్తీపై సంశయం నెలకొంది.

● ప్రాజెక్టుల వారీగా ఇలా..

అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు సంబంధించి ప్రాజెక్టుల వారీగా ఖాళీలు ఇలా ఉన్నాయి. ఆసిఫాబాద్‌లో 260 పోస్టులకు 235 విధులు నిర్వహిస్తుండగా 25 ఖాళీలున్నాయి. అలాగే కాగజ్‌నగర్‌లో 173 పోస్టులకు 166మంది పని చేస్తున్నారు. ఏడు పోస్టులు, సిర్పూరు(టి)లో 202పోస్టులకు 197 మంది పని చేస్తుండగా, 5 ఖాళీలు ఉన్నాయి. జైనూరులో 175 పోస్టులకు 151 మంది పని చేస్తున్నారు. 24 ఖాళీగా ఉన్నాయి. వాంకిడిలో 163 పోస్టులకు గాను 126 మంది పని చేస్తుండగా, 37 పోస్టులు ఖాళీగా న్నాయి. జిల్లాలో 973 పోస్టులకు 875 మంది పని చేస్తున్నారు. 98 పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి చర్యలు


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల, సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎం డేవిడ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం పూర్తి స్థాయి చర్యలు తీసుకుంటుందని చెప్పారు. దివ్యాంగుల సమస్యలపై జిల్లా అధికారులు, దివ్యాంగులతో సమీక్ష సమావేశం నిర్వహించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో దివ్యాంగ పెన్షన్‌పై ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి అందిన దరఖాస్తులను పరిష్కరిస్తామని చెప్పారు. అలింకో సంస్థ వారితో మాట్లాడి అర్హులైన దివ్యాంగులకు ట్రై సైకిళ్ల మంజూరు చేయిస్తామని తెలిపారు. అంగవైకల్యం దేనికి అడ్డుకాదని, సంకల్పం పట్టుదల, మనోధైర్యం ఉంటే అన్ని రంగాల్లో రాణించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖాధికారి భాస్కర్, డీఎంహెచ్‌వో సీతారాం, అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి రామకృష్ణ, నాయకులు అలీబిన్ అహ్మద్, వెంకటేష్, సద్దాం, ఖయ్యూం, రవిశంకర్, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని ఎంఈవో కార్యాలయంలో మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రోహిత్, ఎంపీడీవో శ్రీనివాస్, విద్యా కో ఆర్డినేటర్ మధుకర్, తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్: పట్టణంలోని భవిత కేంద్రంలో, డివిజన్ రిసోర్స్ సెంటర్‌లో మంగవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు మాట్లాడుతూ సమాజంలో దివ్యాంగులను చిన్న చూపు చూడొద్దని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈవో ప్రభాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

రెబ్బెన: దివ్యాంగులకు అద్భుతమైన ప్రతిభ ఉంటుందని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శ్రీనివాస్ అన్నారు. గోలేటి సీఈఆర్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన వేడుకల్లో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, ఎంఈఓ మల్లేశం, సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కౌటాల: మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో మంగళవారం అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవంను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పిల్లలకు క్రీడలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఎంపీడీవో ప్రసాద్, ఎంఈవో హనుమంతు కేక్ కట్ చేసి పిల్లలకు పంచారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గణపతి, ఉపాధ్యాయురాలు కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

లింగాపూర్: తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం తహసీల్దార్ రాజేంద్రప్రసాద్‌వర్మ ఆయన తల్లిదండ్రులు పేరుమామిండ్ల రాంబాయి రాజేశ్వర్ పేరుపై మండలంలోని నిరుపేదలైన 15 మంది దివ్యాంగులకు ఐదు వందల రూపాయల చొప్పున అందజేశారు. మండలకేంద్రంలోని మండల పరిషత్ పాఠశాలలో ఐఆర్పీ రాథోడ్ సుమన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహిం చారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

తిర్యాణి: భవిత కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో అంజయ్య కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఐఈఆర్‌పీలు సుమన్, కుమార్ పాల్గొన్నారు.

డిమాండ్ మేరకు బొగ్గు ఉత్పత్తి చేయాలి

- జీఎంలతో సింగరేణి సీఎండీ బలరామ్

మంచిర్యాల/మందమర్రిటౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఆ మేరకు బొగ్గు ఉత్పత్తి జరిగేలా చర్యలు తీసుకోవాలని సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్ ఆదేశించారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో మంగళవారం అన్ని ఏరియాల జీఎంలతో ప్రత్యేకంగా ఉత్పత్తిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ సింగరేణితో ఒప్పందం ఉన్న థర్మల్ విద్యుత్ కేంద్రాలకు సరిపడా బొగ్గును సరఫరా చేసేందుకు వీలుగా రోజుకు 2.5 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తితోపాటు రవాణా చేయాలని సూచించారు. అలాగేబొగ్గు ఉత్పత్తి సాధనకు వీలుగా రోజుకు 16 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్‌ను తొలగించాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మిగిలి ఉన్న 120 రోజుల్లో ప్రతీ నిమిషం విలువైందని, ఉత్పత్తి లక్ష్య సాధనకు అన్ని ఏరియాలు సమష్టిగా కృషి చేయాలన్నారు. గనులలో ప్రతీ నిమిషం ఉత్పత్తికి కీలకమైందని, ఉత్పత్తిలో ఆలస్యానికి తావులేకుండా గని మేనేజర్లు, ప్రాజెక్టు అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. ఉదయం 7 గంటల వరకు అధికారులు గనుల వద్దకు చేరుకుని కార్మికులకు దిశా నిర్దేశం చేయాలని సూచించారు. ప్రతీ ఒక్కరూ విధిగా 8 గంటల పాటు పనిచేసేలా చూడాలన్నారు. ఒడిశా నైనీ బ్లాక్‌లో చెట్ల గణన కొంతమేర పూర్తయిన నేపథ్యంలో బొగ్గు ఉత్పత్తితో ముడిపడిన ఇతర కార్యక్రమాలను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో డైరెక్టర్లు డి సత్యనారాయణ రావు, వేంకటేశ్వరరెడ్డి, జీఎం(కో ఆర్డినేషన్) ఎస్డీఎం సుభానీ, జీఎం(మార్కెటింగ్) రవిప్రసాద్, కార్పొరేట్ జీఎంలు, ఏరియా జీఎంలు పాల్గొన్నారు.

ఉత్పత్తి పెంపునకు కృషి చేస్తాం

శ్రీరాంపూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): యాజమాన్యం ఈ నెలలో ఇచ్చి న బొగ్గు ఉత్పత్తి లక్ష్యం పెంచేం దుకు కృషి చేస్తామని శ్రీరాం పూర్ ఏరియా జీ ఎం సూర్యనారాయణ అన్నారు. జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏరియాలోని అండర్ గ్రౌండ్ గనుల నుంచి లక్ష వేల 200 టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాల్సి ఉండగా, లక్ష 20 వేల 356 టన్నుల బొగ్గును ఉత్పత్తి చేశామన్నారు. అలాగే ఓసీపీల ద్వారా 4 లక్షల 40 వేల టన్నుల బొగ్గు తీయాల్సి ఉండగా, 3లక్షల 83 వేల 749 టన్నుల బొగ్గును ఉత్పత్తి చేశామన్నారు. మొత్తం 88 శాతం సాధించినట్లు చెప్పారు. ఈ నెల 9వ తేదీ నుంచి 16వ తేదీ వరకు రక్షణ వారోత్సవాలు నిర్వహిస్తున్నామని, ఎటువంటి ప్రమాదాలు లేకుండా చూసేందుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. పెద్దపల్లిలో బుధవారం నిర్వహించనున్న సీఎం సభలో ఏరియాకు చెందిన 80 మందికి ఉద్యోగ పత్రాలు అందించనున్నట్లు వివరించారు. సమావేశంలో ఎస్ఓ టు జీఎం సత్యనారాయణ, డీజీఎం(పర్సనల్) పి అరవిందరావు, డీజీఎం(ఐఈడీ) చిరంజీవులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

మందమర్రి టౌన్, డిసెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖనిలోని ఆర్జీ 1లో మూసివేసిన 7 ఎల్ఈపీ గనిలో మంగళవారం ఇసుక బంకర్ వద్ద పని చేస్తున్న హెడ్ ఓవర్‌మెన్ సత్యనారాయణ ప్రమాదకరంగా మృతి చెందాడని, ఆయన కుటుంబానికి అండగా ఉంటామని ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్ అన్నారు. ఆయన ప్రమాదంలో మృతి చెందిన ఓవర్‌మన్ సత్యనారాయణ మృతదేహాన్ని మంగళవారం ఆసుపత్రిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులను పర్యవేక్షిస్తూ విధి నిర్వహణలో మృత్యువాత పడడడం వారి కుటుంబానికే కాకుండా సింగరేణికి తీరని లోటని చెప్పారు. యాజమాన్యం కుటుంబానికి అండగా నిలవాలన్నారు. కంపెనీ బెనిఫిట్స్‌తో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు.,

ఎస్ఈ సేవలు ప్రశంసనీయం

మందమర్రి టౌన్, డిసెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): మందమర్రి ఏరియా స్టోర్ ఎస్ఈగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న హైదీశ్వర్ సేవలు ప్రశంసనీయమని జీఎం దేవేందర్ అన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక జీఎం కార్యాలయంలో ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

వేతనాల పెంపుపై ప్రభుత్వం ప్రకటన చేయాలి

శ్రీరాంపూర్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కాంట్రాక్ట్ కార్మికుల వేతనాల పెంపుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటన చేయాలని ఏఐటీయూసీ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్ డిమాండ్ చేశారు. యూనియన్ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు కాంట్రాక్టు కార్మికులకు ఇచ్చిన హామీలనునెరవేచాలని కోరారు., సమావేశంలో శ్రీరాంపూర్ బ్రాంచ్ అధ్యక్షుడు దొడ్డిపట్ల రవీందర్, బ్రాంచ్ కార్యదర్శి వీరేశం, ఉపాధ్యక్షుడు ఖాతరాజు ప్రభాకర్, సహాయ కార్యదర్శి చారి తిరుపతి, సత్యనారాయణ, స్వప్న పాల్గొన్నారు.

సమాచారం

టీఎస్‌యూటీఎఫ్ మండల కార్యవర్గం


హరీష్, సాయికుమార్

వాంకిడి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): టీఎస్‌యూటీఎఫ్ వాంకిడి మండల కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా హరీష్, ప్రధాన కార్యదర్శిగా సాయికుమార్, ఉపాధ్యక్షులుగా జమీల్, శారద, కోశాధికారిగా రాజలింగును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సం ఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శాంతి కుమారి, ఇందురావు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి చేతులమీదుగా నియామకపత్రం


నియామకపత్రం అందుకుంటున్న డాక్టర్ పల్లవి

సిర్పూర్(టి), డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) మండల కేంద్రానికి చెందిన దుర్గం పల్లవి రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లో సీఎం చేతుల మీదుగా పీహెచ్‌సీ వైద్యురాలిగా నియామక పత్రాన్ని అందుకున్నారు. డాక్టర్ పల్లవిని కుమరం భీం జిల్లా తిర్యాని పీహెచ్‌సీలో విధులు కేటాయిస్తూ ప్రభుత్వం నియామక పత్రం అందజేసింది. మండల కేంద్రానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడి కూతురు దుర్గం పల్లవి. నిరుపేద కుటుంబంలో పుట్టినా పట్టుదలతో ఎంబీబీఎస్ పూర్తి చేసింది. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం వైద్యుల భర్తీ ప్రక్రియ చేపట్టడంతో ఆమె అందులో పల్లవి చాటింది.

అభిలాష్‌కు తెలంగాణ రోల్‌మోడల్ పురస్కారం


అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయుడు అభిలాష్

ఆసిఫాబాద్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో అంతర్జాతీయ నిర్వహించిన కార్యక్రమంలో ఆసిఫాబాద్ మండలం మేదరిగూడ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న డాక్టర్ నూతి అభిలాష్ రోల్‌మోడల్ ఆఫ్ తెలంగాణ అవార్డును అందుకున్నాడు. విద్యారంగంలో అవార్డులో సాధించడంతో పాటు కవిగా, రచయితగా జాతీయ, అంతర్జాతీయ అవార్డులు పొందిన అభిలాష్ మంత్రి అనసూయ, దివ్యాంగుల కో ఆపరేటీవ్ కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య, జీహెచ్‌ఎంసీ చైర్మన్ విజయలక్ష్మి చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.



కార్మిక నేత అరెస్టు సరికాదు


నిరసన తెలియజేస్తున్న హెచ్‌ఎంఎస్ నాయకులు

మందమర్రిటౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికుల హక్కుల కోసం పోరాడుతున్న తమయూనియన్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్‌ను పోలీసులు అరెస్టు చేయడం సరికాదని హెచ్‌ఎంఎస్ కేంద్ర కమిటీ నాయకులు అన్నారు. మంగళవారం మందమర్రిలోని సీఎస్పీ వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో కేంద్ర కమిటీ నాయకుడు పార్వతి రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'అణచివేయాలని చూస్తే ప్రతిఘటిస్తాం'

శ్రీరాంపూర్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): యూనియన్లు, కార్మిక సంఘ నాయకులను అణచివేయాలని చూస్తే ప్రతిఘటన తప్పదని సింగరేణి కార్మిక సంఘాల ఐక్య వేదిక నాయకులు అన్నారు. నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు మాట్లాడారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన

జైపూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ అక్రమ అరెస్టుకు నిరసనగా మంగళవారం ఇందారం 1ఏ, ఓసీపీ కార్మికులు హెచ్‌ఎంఎస్ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎంఎస్ శ్రీరాంపూర్ వైస్ ప్రెసిడెంట్ తిప్పారపు సారయ్య, నాయకులు అనిల్‌రెడ్డి, కొమురయ్య, పెద్దన్న, లక్ష్మణ్ పాల్గొన్నారు.

కార్మికులకు పదోన్నతులు

కాసిపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాసిపేట 2వ గనిలో వివిధ కేటగిరీల్లో పనిచేస్తున్న 73 మంది కార్మికులకు మంగళవారం గని మేనేజర్ లక్ష్మీనారాయణ పదోన్నతి పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ గని పిట్ సెక్రటరీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఈ నెల 10న గీతా జయంతి ఉత్సవాలు

గర్మిళ్ల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): భగవద్గీత అధ్యయన మండలి ఆధ్వర్యంలో ఈ నెల 10న గీతా జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ప్రోగ్రాం చైర్మన్ గోనె శ్యాంసుందర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాలకు భగీవద్గీత ఫౌండేషన్ వ్యవస్థాపకులు గంగాధర్ హాజరై గీతా సందేశం వినిపిస్తారని తెలిపారు. హరీష్, సత్యనరాయాణ, కృష్ణ, చంద్రశేఖర్, శ్రీనివాస్, దత్తాత్రేయ, బద్రినారాయణ, మల్లారెడ్డి, వెంకట్రావు పాల్గొన్నారు.

ప్రశంసా పత్రాల అందజేత

గర్మిళ్ల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు, ప్రశంసా పత్రాలను డీఎంహెచ్‌వో అందజేశారు. ఉప వైద్యాధికారి సుధాకర్ నాయక్, ఎన్‌సీడీ పీవో ప్రసాద్, డాక్టర్లు అనిల్, వెంకటేశ్వర్లు, ప్రశాంతి,నీలిమ, సీఎస్‌వో రాజేష్, డీఎండీవో సంతోష్, ఐసీటీసీకౌన్సిలర్లు పాల్గొన్నారు.

సదరం శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ నెల 6 నుంచి 19 వరకు జరిగే సదరం శిబిరాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీవో కిషన్ ఒక ప్రకటనలో తెలిపారు. మీసేవలో స్లాట్ బుక్ చేసుకుని నిర్ణీత తేదీల్లో వైద్య పరీక్షల నిమిత్తం హాజరు కావాలని సూచించారు.

విదేశాల్లో పనిచేయడానికి అవకాశం

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ తెలంగాణ ప్రభుత్వ కార్మిక, ఉపాధి శాఖ కింద విదేశాల్లో పనిచేయడానికి అర్హత కలిగిన వారికి ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. యుకే, యుఎస్‌ఏ, జర్మనీ, జపాన్, ఇజ్రాయిల్, గ్రీస్, యుఏఈ తదితర దేశాల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. 18-45 సంవత్సరాలు, టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, జీఎన్‌ఎం నర్సింగ్ అర్హత, అనుభవం ఉండాలన్నారు. 9440051452, 9440049861, 9951909863లో సంప్రదించాలన్నారు.



కవ్వాలలో పులి స్థిర నివాసం ఏర్పర్చుకునేనా..?

- కవ్వాలలో పులుల సందడి
- అభయారణ్యంలో పులుల అలజడి
- ఉమ్మడి జిల్లాలో పెద్ద పులుల కలకలం

జన్నారం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పక్క రాష్ట్రాల నుంచి అడపాదడపా వచ్చిపోయే పులి ఈసారి స్థిర నివాసం ఏర్పాటు చేసుకుంటుందని అధికారులు భావిస్తున్నారు. నెలరోజుల్లో నిర్మల్ జిల్లా నుంచి ఆదిలాబాద్ జిల్లాకు వచ్చిన పెద్దపులి ఉట్నూరు మండలంలోని చందూరు శివారులో రాగులగూడ, ఆదిలాబాద్ జిల్లాలోని నార్నూరు, గాదిగూడ గ్రామాల మధ్య పలువురికి అగుపించింది. ఇటీవల ఖానాపూర్, పెంబి, బోథ్, మామడ, బెల్లంపల్లి, కెరమెరి ప్రాంతాల్లో కనిపించినట్లు అధికారులు పేర్కొంటున్నారు. దీంతో పులి స్థిర నివాసం ఏ ప్రాంతంలో ఏర్పర్చుకుంటుందోనని అధికారులు మానిటరింగ్ చేస్తున్నారు.

కవ్వాల అభయారణ్యం అంటేనే గతంలో పులుల క్షేత్రమని పేరుండేది. అత్యధికంగా పులులు ఉండడంతో 2012లో 44వ పులుల అభయారణ్యంగా తీర్చిదిద్దారు. పులుల రాక కోసం ఏండ్ల తరబడి ఎదురుచూస్తూ అటవీ శాఖ పలు అభివృద్ధి పనులు చేపట్టింది. మహారాష్ట్ర, ఛత్తీస్‌గడ్ రాష్ట్రాల్లో పులులసంఖ్య అధికమైందని, అక్కడి నుంచి పులులు వస్తాయని గుర్తించిన ప్రభుత్వాలు అభయారణ్యంగా తీర్చిదిద్దడంతో వాటిరాక ఖాయమైంది. కవ్వాల టైగర్‌జోన్ ఏర్పడిన తర్వాత నాలుగు సంవత్సరాలకు మొదటిసారిగా మల్యాల అటవీ ప్రాంతంలో పులి అడుగు లభ్యమైంది. నాటినుంచి అడ పాదడపా చుట్టపుచూపులా పులి మేటింగ్ (పునరుత్పత్తి) సమయం అయిన జూలై, ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు మాసాల్లో రావడం, వెళ్లడమే తప్ప స్థిరనివాసం ఏర్పరచుకోలేదు. ఈ యేడు మేటింగ్ సమయంలో పులుల సందడి కవ్వాల టైగర్‌జోన్‌లో మొదలైంది. మహారాష్ట్రలోని తిప్పేశ్వర్, తడోబా, గంగా పతి టైగర్ జోన్‌ల నుంచి పులులు వస్తున్నాయి. రెండు నెలలుగా పులుల గాండ్రిపు నిర్మల్ అటవీ ప్రాంతం, ఖానాపూర్, కడెం మండలంలోని గంగాపూర్, బీర్సా యిపేట, ఉట్నూరు, కెరమెరితోపాటు లింగాపూర్, ఆసిఫాబాద్, పెంచికల్‌పేట్, లక్సెట్టిపేట, తాల్లపేట, అటవీ ప్రాంతాల్లో అగుపిస్తున్నాయి. అటవీ శాఖ అధికారులు పులులు స్థిరనివాసం ఏర్పాటు చేసుకునేలా చర్యలు చేపడుతున్నారు.

● అలజడి తగ్గితేనే నిలకడగా

కవ్వాల టైగర్ జోన్‌కు ఇరువైపులా మహారాష్ట్రలోని తడోబా, తిప్పేశ్వర్ టైగర్ జోన్‌లు ఉన్నాయి. వీటి నుంచి పులులు మేటింగ్ సమయంలో వస్తాయి. ఇవి వెళ్తున్న క్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పత్తి చేన్లు ఉన్నాయి. దీంతో ఇవి పులి రాకకు అడ్డుగా మారుతున్నాయి. పులి మేటింగ్ సమయంలో గాండ్రిస్తూ కోపంగా ఉంటాయి. ఆ సమయంలో అడవిలో అలజడి ఉండడంవల్ల మరింత క్రూరంగా మారే అవకాశాలుంటాయి. అడవిలోకి ఎవరు వెళ్లవద్దని చెబుతున్నా కొందరు వ్యవసాయ పనుల కోసం చేన్లకు వెళ్లడం వల్ల అలజడికి పులి పరుగు తీయడమో లేదా పశువులు, మనుషులపై దాడి చేస్తున్నాయని అధికారులు పేర్కొంటున్నారు.

● అనధికారికంగా పులుల సంఖ్య ఎక్కువే

కవ్వాల టైగర్ జోన్‌లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల్లోని నాలుగు జిల్లాల్లో విస్తరించి ఉంది. 2013, 2014 నుంచి పులుల సంఖ్య పెరుగుతూ వస్తుంది. 2013-14లో ఫాల్గుణ పులికి పుట్టిన చైత్ర, వైశాఖ, జేష్ఠ, ఆషాఢ నాలుగు పులులు ఎదిగి వైశాఖకు మూడు పిల్లలతో పాటు జేష్ఠకు నాలుగు పిల్లలు పుట్టాయి. వీటి జీవన విధానంలో మళ్లీ వేరే ప్రాంతాలకు తరలివెళ్లాయి. కానీ కవ్వాల టైగర్ జన్‌లో ఐదు పులుల కంటే అనధికారికంగా ఎక్కువేనని తెలుస్తుంది.

● పులి ఆవాసానికి పూర్తి ఏర్పాట్లు

కవ్వాల టైగర్ జోన్‌లో పులి వచ్చిన వెంటనే తేలికగా ఆహారం లభించేందుకు గడ్డి క్షేత్రాలను ఏర్పాటు చేసి శాఖాహార జంతువుల సంఖ్యను పెంచుతున్నారు. వేటగాళ్ల ఉచ్చుల బారిన పడకుండా ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేస్తున్నారు. యానిమల్‌ట్రాకర్స్, సిబ్బంది, సీసీ కెమెరాలతో ట్రాకింగ్ చేస్తున్నారు. అటవీ ప్రాంతాల్లో వ్యవసాయ భూముల వద్ద కరెంటు తీగలను తొలగించడం, ఎవరైనా తీగలు అమర్చితే కేసులు పెట్టడం, అడవుల్లోకి పశువులను పంపకుండా చర్యలు తీసుకుంటున్నారు.

అధికారుల లెక్కల ప్రకారం ఐదు పులులు

కవ్వాల టైగర్‌జోన్‌లో ఐదు పులులు తిరుగుతున్నాయని అధికారులు పేర్కొంటున్నారు. కుమరంభీం ఆసిఫాబాద్, బెల్లంపల్లి, కాగజ్‌నగర్, బెజ్జూరు, పెంచికల్‌పేట్ ప్రాంతాల్లో నాలుగు పులులు సంచరిస్తున్నాయని కొత్తగా ఐదవ పులి చేరిందని అది నిర్మల్, పెంబి, మామడ, గంగాపూర్, ఉట్నూరు, కెరమెరి, లింగాపూర్ ప్రాంతాల్లో సంచరిస్తున్నట్లు తెలుస్తోంది. ఐదు పులుల్లో మూడు మగ, రెండు ఆడ అని తెలుస్తోంది. మేటింగ్ సమయంలో కవ్వాల టైగర్ జోన్‌లోకి పులులు రావడంతో అటవీ అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పులుల సంరక్షణలో నిమగ్నమవుతున్నారు.

తగిన చర్యలు చేపట్టాం



పులులు అటవీ ప్రాంతంలో తిరుగుతున్నాయి. వాటి సంరక్షణకు ఇప్పటికే చర్యలు చేపట్టాం. అటవీ సమీప గ్రామాల ప్రజలను పులికి హానీ తలపెట్టవద్దని, అడవిలోకి వెళ్లవద్దని అవగాహన కల్పిస్తున్నాం. ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేపడుతున్నాం. పులి ఆహారం కోసం పెద్ద సంఖ్యలో గడ్డి క్షేత్రాలను ఏర్పాటు చేసి శాఖాహార జంతువుల సంఖ్యను పెంచుతున్నాం.

-శ్రీనివాస్, ఎఫ్‌ఆర్‌వో , ఇందన్‌పల్లి

పడకేసిన పల్లె దవాఖానాలు

3 వపేజీ తరువాయి

ఆదివాసీలకు అందుబాటులో లేని వైద్యం

మండలంలోని 22 గ్రామపంచాయతీల్లో 34 వేలకు పైగా జనాభా ఉంది. ఇందులో 16 గ్రామపంచాయతీలు ఏజెన్సీలో కొనసాగుతున్నాయి. ఏజెన్సీలో 15 వేల జనాభాకు ఒక పీహెచ్‌సీ ఉండాలనే నిబంధన ఉండగా 34 వేలకు పైగా జనాభా ఉన్న మండలంలో 7 హెల్త్ సబ్ సెంటర్లు, ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉంది. ఆదివాసీలకు మెరుగైన వైద్య సేవలందించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేవలం దేవాపూర్ పంచాయతీలోనే 11 వేల జనాభా ఉంది. ఆదివాసీలకు మెరుగైన వైద్య సేవలందించాలంటే మరో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆదివాసీ సంఘాలు కోరుతున్నాయి.

నిర్మాణ పనులను పూర్తి చేయాలి



గట్రావుపల్లి ఆరోగ్య ఉప కేంద్రం మంజూరై ఏండ్లు గడుస్తుంది. అయినా ఇప్పటి వరకు నిర్మాణం పూర్తి కాలేదు. కాసిపేటకు పోవాలంటే కష్టమవుతుంది. దవాఖానా నిర్మిస్తామని చెప్పి 17 ఏండ్లు అవుతుంది. ఇంకా పూర్తి కాలేదు. అధికారులు గిరిజనుల బాధలను పట్టించుకోవడం లేదు. త్వరగా ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేసి వైద్య సేవలందించాలి.

- అర్కజైతు, గట్రావుపల్లి

మెరుగైన వైద్య సేవలందిస్తున్నాం

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలందిస్తున్నాం. కాసిపేట, గట్రావుపల్లి ఉప కేంద్రాల నిర్మాణ పనులపై నివేదికలను ఉన్నతాధికారులకు అందజేశాం. ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఉప కేంద్రాలను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటాం. జ్వర పీడిత గ్రామాలను గుర్తించి వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తూ రోగాలను నియంత్రిస్తున్నాం.

-డాక్టర్ రవికిరణ్, కాసిపేట మెడికల్ ఆఫీసర్

రూ.10 కోట్లతో పట్టణంలో అభివృద్ధి పనులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి

చెన్నూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణాన్ని అభివృద్ధి చేసేందుకు రూ.10 కోట్ల నిధులను కేటాయించినట్లు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి తెలిపారు. మంగళవారం ప్రజాపాలన వారోత్సవాల్లో భాగంగా మున్సిపాలిటీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మాట్లాడారు. పట్టణాన్ని అభివృద్ధి చేసేందుకు రూ.10 కోట్లతో ప్రణాళికలు తయారు చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీల్లో 5 గ్యారంటీలను అమలు చేశామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నాడన్నారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి నెలకు రూ.300 కోట్లు ప్రభుత్వం ఆర్టీసీకి చెల్లిస్తుందన్నారు. రూ. 2 లక్షల రైతు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, వైస్‌చైర్మన్ నవాజుద్దీన్, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

జైపూర్, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. టేకమట్లలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోకుండా కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని పేర్కొన్నారు. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఏకరూప దుస్తులను అందజేశారు.

టేకుమట్లలో నవంబరు నెలలో ఎస్టీపీపీ రైల్వే ట్రాక్ గుంతలో పడి మృతిచెందిన రాజ్‌కుమార్ కుటుంబానికి రూ. 15 లక్షల పరిహారం చెక్కును ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి, కలెక్టర్ కుమార్‌దీపక్‌లు అందజేశారు.

కోటపల్లి, (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి అన్నారు. అర్జునగుట్ట, రాపన్‌పల్లి, దేవులవాడ, రాంపూర్, పారుపెల్లి, రొయ్యలపల్లి, ఆల్గామ, జనగామ గ్రామాల్లో డీఎంఎఫ్‌టీ నిధులతో సీసీ రోడ్ల పనులు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ప్రధాన రహదారుల్లో బ్రిడ్జీలు, కల్వర్టులు, అంతర్గత రహదారుల నిర్మాణం చేపడుతున్నామన్నారు. జడ్పీ మాజీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, మాజీ సర్పంచులు లక్ష్మణ్‌గౌడ్, సంతోష్, మాజీ ఎంపీపీ వెంకటస్వామి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భీమారం, (ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి పేర్కొన్నారు. రైతు వేదికలో 25 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. మండల స్పెషల్ ఆఫీసర్ కల్పన, తహసీల్దార్ సదానందం, రాజన్న, రాజ్‌కుమార్, రవీందర్ పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులు సాధారణ పిల్లలతో సమానంగా రాణించాలి



మాట్లాడుతున్న డీఈఓ ఎస్.యాదయ్య, జీఎం దేవేందర్, అధికారులు, దివ్యాంగులు

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగ విద్యార్థులు సాధారణ పిల్లలతో సమానంగా రాణించాలని డీఈవో యాదయ్య అన్నారు. మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా భవితా కేంద్రంలో నిర్వహించిన దివ్యాంగ దినోత్సవ వేడుకల్లో మాట్లాడారు. ప్రతీ వ్యక్తి లక్ష్యసాధనకు చదువు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. దివ్యాంగ పిల్లల కోసం ప్రభుత్వం ఎన్నో రకాలుగా ప్రోత్సహిస్తుందని, వాటన్నింటిని సద్వినియోగం చేసుకుంటూ సాధారణ పౌరులతో సమానంగా ఎదగాలన్నారు. అనంతరం సమ్మిళిత విద్య కోఆర్డినేటర్ చౌదరి మాట్లాడుతూ దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాలు అందజేస్తారని, రెగ్యులర్ పాఠశాలలకు వెళ్లే వారికి రవాణా, ఎస్కార్ట్ అలవెన్సు, బాలికలకు స్టైఫండ్ సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఆటల పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు. మండల విద్యాధికారి మాలవీదేవి, కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయురాలు పద్మజ, ఈఆర్‌పీలు సృజన, శ్రీలత పాల్గొన్నారు.

మందమర్రిటౌన్, (ఆంధ్రజ్యోతి): మానసిక దివ్యాంగులకు మనోధైర్యం కల్పిస్తూ వారిని ప్రోత్సహించాలని జీఎం దేవేందర్ తెలిపారు. మనోవికాస్ మానసిక దివ్యాంగుల పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. సింగరేణి యాజమాన్యం పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి చేయూతనందిస్తుందన్నారు. ఆయా స్టేషనరీలను విద్యార్థులు తయారు చేస్తూ పాఠశాల ఆర్థిక ప్రగతికి తోడ్పడుతున్నారన్నారు. ఆటల పోటీల్లో గెలిచిన వారికి జీఎం బహుమతులు అందించారు. సలేంద్ర సత్యనారాయణ, శ్యాంసుందర్, ఆసిఫ్, సురేఖ, రాజలింగు పాల్గొన్నారు.

దివ్యాంగులను ప్రభుత్వం ఆదుకోవాలి

మందమర్రిరూరల్, (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులను ప్రభుత్వం ఆదుకోవాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ కోర్ కమిటీ వైస్ చైర్మన్ పెద్దపల్లి సత్యనారయణ కోరారు. బ్యాక్‌లాగ్ ఉద్యోగాలు భర్తీ చేయాలని, స్థానిక సంస్థల నుంచి చట్ట సభల వరకు రిజర్వేషన్ కల్పించాలని, నామినేటెడ్ పోస్టుల్లో అవకాశం కల్పించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లలో 5 శాతం రిజర్వేషన్ కేటాయించాలన్నారు. దివ్యాంగ కార్పోరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు.

నెన్నెల, (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులైన విద్యార్థుల లోపాలను ఎత్తిచూపకుండా వారిలో దాగిఉన్న ప్రతిభను వెలికి తీసెందుకు కృషి చేయాలని ఎంఈవో చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. దుబ్బపల్లి-ఎస్ పాఠశాలలో దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. సమగ్ర శిక్ష ద్వారా అందించే ఫిజియోథెరపీ, ఇంటి వద్దనే విద్య, ట్రాన్స్‌పోర్ట్ ఎస్కార్ట్ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పిల్లలతో కేక్ కట్ చేయించారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం చంద్రశేఖర్, హెచ్‌ఎం రవికుమార్, ప్రత్యేక ఉపాధ్యాయులు భీమేష్, మల్లిఖార్జున్ పాల్గొన్నారు.

భీమారం, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ వద్ద దివ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఎంఈవో సురేష్ మాట్లాడుతూ భవిత కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోటీల్లో గెలుపొందిన దివ్యాంగ పిల్లలకు బహుమతులు అందించారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్‌రావు, ఎంఐఎస్ సునీల్, సీసీవో ఇంతియాజ్, సీఆర్‌పీ పాల్గొన్నారు.

వేమనపల్లి, (ఆంధ్రజ్యోతి): వేమనపల్లిలోని ఎంఆర్‌సీలో నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి ఎంఈవో శ్రీధర్‌రెడ్డి బహుమతులు అందించారు. నీల్వాయి జెడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయుడు గిరిధర్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హాజీపూర్, (ఆంధ్రజ్యోతి): పడ్తన్‌పల్లిలోని ఎంపీయూపీఎస్ పాఠశాలలోని భవిత కేంద్రంలో దివ్యాంగులకు నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి ఎంఈవో తిరుపతిరెడ్డి బహుమతులు అందజేశారు. మండల నోడల్ అధికారి హనుమాండ్లు, ప్రధానోపాధ్యాయులు మణికుమార్, ఐఆర్‌పీ శ్రీరాములు, స్రవంతి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



ఫీల్డ్ అసిస్టెంట్ బాబును సన్మానిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

కాసిపేట, (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల హక్కులను కాపాడాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించాలని తహసీల్దార్ భోజన్న, ఎంపీడీవో సత్యనారాయణ సింగ్‌లకు దివ్యాంగుల సంఘం నాయకులు వినతి పత్రం అందించారు. మండల అధ్యక్షుడు సుమన్ మాట్లాడుతూ అంత్యోదయ రేషన్ కార్డులను అందజేయాలని, నెలకు రూ.6 వేల పింఛన్, ఇందిరమ్మ ఇండ్లు అందించాలన్నారు. గని వెల్ఫేర్ ఆఫీసర్ భార్గవ్ వికలాంగులకు టిఫిన్ బాక్సులు అందజేశారు.

ఉత్తమ ఫీల్డ్ అసిస్టెంట్‌గా బాబు

మందమర్రిరూరల్, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆదిల్‌పేట గ్రామానికి చెందిన ఉపాధి హామీఫీల్డ్ అసిస్టెంట్ బాబును మంగళవారం కలెక్టర్ కుమార్ దీపక్ కార్యాలయంలో సన్మానించారు. దివ్యాంగుడైన బాబు ఫీల్డ్ అసిస్టెంట్ విధులను సమర్థవంతంగా నిర్వహించడంతో ఉత్తమ ఉద్యోగిగా ఎంపిక చేశారు.

వరి కొయ్యలు కాల్చవద్దు



నెల్కివెంకటాపూర్‌లో వరి కొయ్యలను కాలుస్తున్న రైతు (ఫైల్)

- నేలలోని పోషకాలపై తీవ్ర ప్రభావం
- పొలంలోనే కలియదున్నితే భూసారం పెంపు

దండేపల్లి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలకు చేరుతోంది, యాసంగి పనులు ప్రారంభమవుతున్నాయి. వరికోతల తరవాత రైతులు కొయ్యలతో పాటు గడ్డిని (అవశేషాలు) కాల్చుతున్నారు. ఇలా కాల్చడం వల్ల భూమికి తీరని నష్టం వాటిల్లుతుందని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. కొయ్యలకు నిప్పు పెట్టకుండా భూమిలోనే కలియదున్నాలని బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ కోట శివకృష్ణ పేర్కొన్నారు.

● మట్టిలో కోట్లాది సూక్ష్మజీవులు ఉంటాయి. ఇందులో పంటలకు మేలు చేసే మిత్ర పురుగులు కూడా ఉంటాయి

● వరి కొయ్యలను కాల్చడంతో వాతావరణ కాలుష్యం పెరుగుతుంది.

● విపరీతమైన వేడితో పంట భూమి సారాన్ని కల్పోతుంది.

● నత్రజని, ఫాస్పరస్ లాంటి పోషక పదార్థాల శాతం తగ్గి పంట దిగుబడి పడిపోతుంది.

● భూమికి పీచు పదార్థంగా ఉపయోగపడే అవశేషాలు కాలిపోతాయి.

● పంటలకు అవసరమైన ఖనిజ లవణాలు దెబ్బతింటాయి.

● నేలకు మేలు చేసే క్రిమి కీటకాలు నశించడమే కాక భూసారం తగ్గిపోతుంది.

● నేలలో గడ్డిని దున్నడంవల్ల సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుంది.

● భూసారంతో పాటు దిగుబడులు పెరిగి రైతులకు మేలు జరుగుతుంది.

● పొలాల్లో తిరిగే అనేక జీవరాశులు చనిపోయే ప్రమాదం ఉంటుంది.

భూసారం పెంపునకు దోహదం

● వరి కొయ్యలు నేలలో కలియ దున్నడం వల్ల సేంద్రియ కర్బన శాతం పెరిగి పంట దిగుబడులు 5 నుంచి 10శాతం పెరిగే అవకాశముంది.

● దుక్కి దున్నే సమయంలో సూపర్ ఫాస్పేట్ చల్లితే అవశేషాలు రెండు వారాల్లో మురిగి పోషకాలు గా అందుబాటులోకి వస్తాయి.

● ఫలితంగా డీఏపీ వాడకం సగం వరకు తగ్గుతుంది.

● దున్నడం వల్ల ఎకరాకు దాదాపుగా టన్ను ఎరువు తయారవుతుంది.

● మొక్కలకు 2శాతం నత్రజని(యూరియా), 4 శాతం ఫాస్పరస్ అదనంగా అందుతుంది

● జింక్, మాంగనీస్, ఇనుము, కాల్షియం లాంటి సూక్ష్మదాతువులు పంటకు మేలు చేకూర్చుతాయి.

● నేలలో కరగని మూలకాలను అనుకూలంగా మార్చుతుంది. నీటి నిల్వ పెరుగుతుంది.

● కొయ్యకాళ్లను భూమిలో కలియ దున్నితే, గడ్డి ద్వారా పోషకాలన్నీ తిరిగి నేలకు చేరుతాయి.

● భూమిలో పంట అవశేషాలను కలియదున్ని ఎకరాకు మూడు బస్తాల సూపర్ ఫాస్పెట్ చల్లితే భూమిలోనే ఎరువుగా ఉపయోగపడుతుంది. రసాయన ఎరువులకు పెట్టే ఖర్చు 50శాతం తగ్గుతుంది.

● రైతులకు అవగాహన లేక వరి కొయ్యలను కాల్చుతుండటంతో నష్టం వాటిల్లుతుంది.

● వరి కొయ్యలను కాల్చే సమయంలో మంటలు ఎగిసిపడి ఒక్కోసారి రైతుకు మంటలు అంటుకొని మరణించిన సంఘటనలు ఉన్నాయి.

బీఆర్‌ఎస్‌వీ నాయకుల నిరసన

హాజీపూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : గుడిపేట, ముల్కల్ల గ్రామాల్లోని సోషల్ వెల్ఫేర్, గురుకుల పాఠశాలలను సందర్శించేందుకు వెళ్లిన బీఆర్‌ఎస్‌వీ నాయకులను అధికారులు అడ్డుకున్నారు. దీంతో నాయకులు పాఠశాలల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర నాయకులు చెన్నమల్ల చైతన్య, అఖిల్, సత్యంలు మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలను తెలుసుకోవడానికి వెళ్లిన తమను అడ్డుకోవడం సరైంది కాదన్నారు. మాజీ సీఎం కేసీఆర్ గురుకులాలు, హాస్టళ్లల్లో సౌకర్యాలు కల్పించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పర్యవేక్షణ లేకపోవడంతో అధ్వాన్నంగా తయారయ్యాయన్నారు. నాణ్యమైన ఆహారం లభించక విద్యార్థులు ఆసుపత్రుల పాలవుతున్నారన్నారు. గొల్ల శ్రీనివాస్, ఆసాధి ప్రవీణ్, చెరుకు శ్రీనివాస్, రవి, వినోద్ పాల్గొన్నారు.

కాసిపేట, (ఆంధ్రజ్యోతి): గురుకులాలు, హాస్టళ్ల నరకకూపాలుగా మారాయని బీఆర్‌ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు బడికెల శ్రావణ్ అన్నారు. రేగులగూడెం గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించేందుకు వచ్చిన నాయకులను అడ్డుకోవడంతో గేటు ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గురుకులాలు, హాస్టళ్లకు వెళ్లి సమస్యలను తెలుసుకోవడానికి వెళితే పోలీసులతో అడ్డుకోవడం సరైంది కాదన్నారు. అరుణ్, మహేందర్, మాజీ సర్పంచు బాదు, ఉపసర్పంచు బోయిని తిరుపతి, సుమన్, కళ్యాణ్, రోషన్, పాల్గొన్నారు.

ఆరోగ్యంగా ఉండాలంటే కాలుష్య నివారణే మార్గం

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యంగా ఉండాలంటే కాలుష్య నివారణే మార్గమని ఎన్‌సీడీపీఓ డాక్టర్ ప్రసాద్ అన్నారు. మంగళవారం పాత మంచిర్యాల ప్రభుత్వ ఉన్న పాఠశాలలో నిర్వహించిన జాతీయ వాయు కాలుష్య నివారణ దినోత్సవ వేడుకలకు ఆయన హాజరయ్యారు. ఈ ప్రాంతంలో పలు రకాల ఆరోగ్య సమస్యలతో బాధపడే ప్రజలకు, విద్యార్థిని, విద్యార్థుల ఆరోగ్య సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సైన్స్ టీచర్ మంజులను అభినందించారు. అనంతరం విద్యార్థులు కాలుష్య నివారణకు సంబంధించిన పేయింటిగ్స్‌ను ప్రదర్శించారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు సంగీత, డీపీవో ప్రశాంతి, సీహెచ్‌వో డీపీవో ఎన్‌సీడీ లింగారెడ్డి, పాల్గొన్నారు.

హామీలు అమలుచేయని కాంగ్రెస్ ప్రభుత్వం

చెన్నూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని బీజేపీ పెద్దపల్లి పార్లమెంట్ కన్వీనర్ నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జీ అరుముళ్ల పోశంలు పేర్కొన్నారు. మంగళవారం బీజేపీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. ఎమ్మెల్యే వివేక్ కాళేశ్వరం ప్రాజెక్టు ముంపు గ్రామాలైన పరివాహక ప్రాంతాలకు కరకట్టలు నిర్మిస్తానని చెప్పి ఇంత వరకు చేయలేదన్నారు. యువతకు ఉద్యోగాలు కల్పిస్తానని మోసం చేశారన్నారు. రమేష్, దీక్షితులు, వెంకటేశ్వర్, చారి, శ్రీనివాస్, పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఈవీఎం భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు

హాజీపూర్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి) : ముల్కల్ల ఐజా ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రతను కలెక్టర్ కుమార్ దీపక్ పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం, మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూరు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రత ఏర్పాట్లు చేశామన్నారు. సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తున్నామన్నారు. తహసీల్దార్ శ్రీనివాసరావు దేశ్‌పాండే, అధికారులు ఉన్నారు.

అగ్ని ప్రమాదాల వల్ల పర్యావరణానికి ముప్పు

కాసిపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అడవుల్లో అగ్ని ప్రమాదాల వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని ముత్యంపల్లి డిప్యూటీ రేంజ్ అటవీ శాఖ అధికారి ప్రవీణ్‌నాయక్ అన్నారు. మంగళవారం ముత్యంపల్లి, ధర్మారావుపేట, మామిడిగూడెం, చింతగూడెం, బుగ్గగూడెం, పెద్ద ధర్మారం, గురువాపూర్ గ్రామాల్లో అవగాహన కల్పించారు. అడవిలో బీడీ, సిగరెట్లు కాల్చి పడేయవద్దని సూచించారు. అగ్ని ప్రమాదాల నివారణకు ఫైర్ బ్లోయర్ సహాయంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎఫ్‌బీవోలు శ్రీదర్,యుగేందర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

టెన్త్, ఇంటర్ ప్రవేశాల గడువు ఈనెల 11

దండేపల్లి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలు పొందేందుకు ఈనెల 11లోగా దరఖాస్తు చేసుకోవాలని ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ ఎన్ శ్రీనివాస్, సహాయ కో ఆర్డినేటర్ రాజేశ్వర్ రావులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 8309769067 ఫోన్‌లో సంప్రదించాలన్నారు.

పడకేసిన పల్లె దవాఖానాలు



కాసిపేటలో తెరుచుకోని పల్లె దవాఖానా

- ఆసుపత్రులకు పరిమితమవుతున్న ఎంఎల్‌హెచ్‌పీలు
- పల్లె ప్రజలకు అందని వైద్య సేవలు
- అసంపూర్తిగా ఆరోగ్య ఉపకేంద్రాలు

కాసిపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన సేవలందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన పల్లె దవాఖానాల లక్ష్యం నెరవేరడం లేదు. హెల్త్ సబ్ సెంటర్లను పల్లె దవాఖానాలు (ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్)గా మార్చారు. ప్రభుత్వం ఎంబీబీఎస్ డాక్టర్లను పల్లె దవాఖానాల్లో నియమించింది. ఎంఎల్‌హెచ్‌పీ (మల్టీ లెవెల్ హెల్త్ ప్రొవైడర్)లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకే పరిమితం కావడంతో పల్లె ప్రజలకు మెరుగైన వైద్యం అందడం లేదు. క్షేత్రస్థాయిలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఇచ్చే మాత్రలు మినహా మెరుగైన వైద్యం అందడం లేదనే ఆరోపణలున్నాయి. కాసిపేట, గట్రావుపల్లి ఆరోగ్య ఉప కేంద్రాలు కొన్నేళ్ళుగా నిర్మాణ దశలోనే కొనసాగుతున్నాయి.

సబ్ సెంటర్లు పల్లె దవాఖానాలుగా....

పల్లె ప్రజలకు 12 రకాల సేవలను అందించాలనే లక్ష్యంతో పల్లె దవాఖానాల్లో నియమించిన సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. మండలంలోని దుబ్బగూడెం ఆరోగ్య ఉప కేంద్రానికి ఎంబీబీఎస్ చదివిన వారిని ఎంపిక చేయగా గట్రావుపల్లి, ధర్మారావుపేట ఉప కేంద్రాలకు బీఎస్సీ నర్సింగ్, దేవాపూర్, పల్లంగూడ ఉప కేంద్రాలకు బీఏఎంఎస్‌లను నియమించారు. వీరు ఉప కేంద్రాలకు మొక్కుబడిగా వెళ్తూ ఆరోగ్య కేంద్రాల్లో ఉండడంతో గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం అందడం లేదు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరు గారిపోతోంది.

అదనపు సేవల కోసమే ఆరోగ్యమందిరాలు

గ్రామీణ ప్రాంతాల్లో అదనపు సేవలు అందించేందుకు ప్రతీ సబ్ సెంటర్‌లో పల్లె దవాఖానా (ఆరోగ్య మందిర్)లు ఏర్పాటు చేశారు. ఇక్కడ ఒక ఎంఎల్‌హెచ్‌పీతో పాటు స్టాఫ్‌నర్సు అందుబాటులో ఉండి వైద్య సేవలందించాలి. ఈ కేంద్రాల్లో మాతాశిశు సంరక్షణ, వ్యాధి నిరోధక టీకాలు, కుటుంబ నియంత్రణ, అంటువ్యాధుల నియంత్రణ, సాధారణ వ్యాధులకు చికిత్స, అసంక్రమిత వ్యాధుల బారిన పడిన వారికి మాత్రలు పంపిణీ చేయాలి. రోగులను పరీక్షించి అవసరాన్ని బట్టి ఆసుపత్రులకు రెఫర్ చేయాలి. పల్లె దవాఖానాల్లో సిబ్బంది ఉండకపోవడంతో వైద్య సేవలు అందడం లేదు.

నిర్మాణ దశలోనే ఆరోగ్య ఉప కేంద్రాలు

సోనాపూర్ ఉమ్మడి పంచాయతీ పరిధిలో గట్రావుపల్లి, కాసిపేట మేజర్ పంచాయతీ పరిధిలోని ఆరోగ్య ఉప కేంద్రాలు ఏండ్లు గడుస్తున్నా నిర్మాణ దశలోనే కొనసాగుతున్నాయి. మేజర్ పంచాయతీ కాసిపేటలోని ఆరోగ్య ఉప కేంద్రానికి రోగుల తాకిడి ఎక్కువ. అయినా ఇక్కడ ఎంఎల్‌హెచ్‌పీని కేటాయించలేదు. గ్రామపంచా యతీ కార్యాలయంలో నిర్మించిన చిన్న రేకుల షెడ్డు లోనే ఉప కేంద్రాన్ని కొనసాగిస్తున్నారు. రోగులకు సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. గట్రావుపల్లి ఆరోగ్య ఉప కేంద్రం 2006లో మంజూరు కాగా 2007లో పనులు ప్రారంభించారు. 17 ఏండ్లు గడిచినా పూర్తిస్థాయిలో నిర్మాణం కాకపోవడంతో సాలె గూడలోని అద్దె ఇంట్లో ఉప కేంద్రాన్ని నిర్వహిస్తు న్నారు. అత్యవసర పరిస్థితులు వస్తే 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న మండల కేంద్రంలోని ప్రధాన ఆసుపత్రికి వెళ్ళాల్సిందే. సకాలంలో సరైన వైద్య సేవలందక గిరిజన గూడాల ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

మిగతా 7వ పేజీలో..


గట్రావుపల్లిలో నిర్మాణ దశలో ఉన్న ఆరోగ్య ఉప కేంద్రం

భర్తీ ఎప్పుడు..?

- ఖాళీగా అంగన్‌వాడీ టీచర్, ఆయా పోస్టులు
- పలుచోట్ల ఇన్‌చార్జిలే దిక్కు
- పనిభారంతో ఇబ్బందులు

4



కవ్వాలలో పులి స్థిర నివాసం ఏర్పర్చుకునేనా..?

- కవ్వాలలో పులుల సందడి
- అభయారణ్యంలో పులుల అలజడి
- ఉమ్మడి జిల్లాలో పెద్ద పులుల కలకలం

5



వాహనాల్లో డీజిల్ చోరీ...?

-పారిశుధ్య కార్మికుడే సూత్రధారి
-బహిరంగంగా అమ్ముకుంటున్నట్లు ఆరోపణలు
-తప్పుడు ప్రచారమంటున్న మున్సిపల్ అధికారి

మంచిర్యాల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల మున్సిపాలిటీకి చెందిన పారిశుధ్య వాహనాల నుంచి డీజిల్ చోరీకి గురైనట్లు కార్మికులు ఆరోపించారు. మంగళవారం చోరీకి గురైనట్లు భావిస్తున్న బాటిళ్లలో నింపి ఉన్న డీజిల్‌ను కార్మికులు కార్యాలయ ఆవరణలో మీడియా ఎదుట ప్రదర్శించారు. వారు తెలిపిన వివరాల ప్రకారం సుమన్ అనే పారిశుధ్య విభాగం కార్మికుడు వాహనాల నుంచి డీజిల్ తీస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. వారం క్రితం సంపత్ అనే కార్మికుడు ఇదే క్రమంలో పారిశుధ్య వాహనాల్లో డీజిల్‌ను దొంగిలించి బయట అమ్ముకున్నాడని ఆరోపించారు. సుమన్ అనే కార్మికుడిని ప్రశ్నించగా తాను ఊరెళుతున్నందున మోర్ మార్కెట్ సమీపంలో ఉన్న బంకులో డీజిల్ కొనుగోలు చేసినట్లు తెలిపాడు. దీంతో కార్మికులు అక్కడికి వెళ్లి విచారణ జరుపగా ప్రస్తుతం ఆ బంక్ మూతపడి ఉండటం గమనార్హం. ఈ విషయమై మున్సిపల్ సానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉదయ్‌ని వివరణ కోరగా పారిశుధ్య వాహనాల్లో కార్మికుడు డీజిల్ దొంగిలించినట్లుగా జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సంక్షేమం దిశగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవంలో భాగంగా దివ్యాంగులను సన్మానించారు. కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగుల పరిరక్షణ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని, ప్రత్యేక కమ్యూనిటీ హాలు ఏర్పాటుపై చర్యలు తీసుకుంటామన్నారు. దివ్యాంగుల సౌకర్యం కోసం ట్రైసైకిళ్లు అందిస్తామన్నారు. జిల్లా సంక్షేమాధికారి స్వరూపరాణి, అధికారులు దుర్గాప్రసాద్, రవీందర్‌రెడ్డి, రాజేశ్వరి, గణపతి, తదితరులు పాల్గొన్నారు.


దివ్యాంగుడిని సన్మానిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

విద్యార్థుల మానసిక స్థితిగతులను పర్యవేక్షించాలి

ఇంటర్మీడియట్ విద్యార్థుల మానసిక స్థితిగతులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఇంటర్మీడియట్ జిల్లా అధికారి అంజయ్యతో కలిసి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్ విద్యార్థుల శారీరక పరిస్థితి, మానసిక ప్రవర్తనలపై పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో టెలిమానస్ ద్వారా మానసిక వైద్య నిపుణులు సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో ఇంటర్ విద్యార్థులకు డ్రగ్స్ డీ ఆడిక్ట్, పరీక్షల సమయంలో ఒత్తిడి, ఆందోళన ఇతర మానసిక సమస్యలపై వైద్య సేవలు అందిస్తామన్నారు. 14416 నెంబర్ ద్వారా టెలిమానస్ సేవలు పొందవచ్చని, తల్లిదండ్రులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్రమం తప్పకుండా పేరెంట్స్ సమావేశాలు నిర్వహించాలని, విద్యార్థులపై ఒత్తిడిని నియంత్రించి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలి తాలు సాధించే విధంగా ప్రోత్సహించాలని తెలిపారు. ప్రభు త్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

జిల్లాలో పెరుగుతున్న పులుల సంచారం

- మొన్న పెద్దపులి, నేడు చిరుత
- ధ్రువీకరిస్తున్న అటవీ అధికారులు
- భయాందోళనలో అటవీప్రాంత గ్రామాల ప్రజలు
- హాని తలపెట్టవద్దంటూ ప్రచారం



మంచిర్యాల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లాలో పులుల సంచారం క్రమంగా పెరుగుతోంది. లక్షెట్టిపేట అటవీ రేంజ్ పరిధిలో పెద్దపులి సంచరించగా, తాజాగా బెల్లంపల్లి ఫారెస్టు డివిజన్ పరిధిలో చిరుతపులి కనిపించింది. అటవీ అధికారులు పులుల సంచారాన్ని ధ్రువీకరించారు. అటవీ సమీప గ్రామాల ప్రజలు ఎప్పుడు ఏం జరుగుతోందనని భయాందోళనకు గురవుతున్నారు. పొరుగున ఉన్న కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలో జరిగిన పులి దాడి ఘటన మరవక ముందే జిల్లాలో చిరుతపులి ప్రత్యక్షం ప్రజలను కలవరానికి గురి చేస్తోంది. కాగజ్‌నగర్ మండలం గన్నారం గ్రామానికి చెందిన మహిళపై పులి దాడి చేయ గా ఆమె అక్కడికక్కడే చనిపోయింది. మరుసటి రోజే సిర్పూర్ మండలం దుబ్బగూడెంకు చెందిన రైతు సురేష్‌పైనా దాడి చేయగా, ప్రాణాలతో బయట పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

జిల్లాలో 20 వరకు చిరుతలు...

జిల్లాలోని జన్నారం, లక్షెట్టిపేట, బెల్లంపల్లి, చెన్నూరు అటవీ డివిజన్ల పరిధిలో 20 వరకు చిరుత పులులు సంచరిస్తున్నట్లు తెలుస్తోంది. లక్షెట్టిపేట రేంజ్ పరిధిలో నాలుగైదు చిరుతలు సంచరిస్తుండగా, బెల్లంపల్లి డివిజన్‌లో ఆరు వరకు ఉన్నట్లు సమాచారం. అలాగే జన్నారం, చెన్నూరు అటవీ డివిజన్‌ల పరిధిలోనూ పది వరకు చిరుత పులులు సంచరిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు భావిస్తున్నారు. మంగళవారం తెల్లవారు జామున బెల్లంపల్లి అటవీ రేంజ్ పరిధిలోని చర్లపల్లి గ్రామంలో స్థానికులకు చిరుత కనపడటంతో అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో అటవీ రేంజ్ అధికారి పూర్ణచందర్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. అడవిలో చిరుత పాదముద్రలను గుర్తించిన అధికారులు ప్రజలను అప్రమత్తం చేశారు. జన్నారం డివిజన్ మొదలుకొని చెన్నూరు వరకు అటవీ ప్రాంతంలో పెద్ద పులులు, చిరుతలు ఒక చోటు నుంచి మరో చోటుకు వెళ్తున్నాయి. పులులు ఎక్కడ ప్రత్యక్షం అవుతా యో తెలియక ప్రజలు భయాందోళనకు గరవుతున్నారు.

అటవీ ప్రాంతానికి వెళ్లకూడదు...

బెల్లంపల్లి రేంజ్ పరిధిలో చిరుత సంచరిస్తున్నందున తెల్లవారుజాము, రాత్రి సమయాల్లో అటవీ ప్రాంతంలోకి వెళ్లవద్దని రేంజర్ పూర్ణచందర్ ప్రజలకు సూచించారు. చిరుతలు, పెద్దపులులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలని ఫారెస్ట్ అధికారులు ప్రజలను కోరుతున్నారు. మనుషులు జాగ్రత్తలు తీసుకోవాలని, ఆవులు, మేకలపై దాడులు చేస్తే పరిహారం అందజేస్తామని ప్రచారం చేస్తున్నారు.


చర్లపల్లిలో చిరుతపులి అడుగులను గుర్తిస్తున్న అటవీ శాఖ అధికారులు

చర్లపల్లిలో చిరుత సంచారం

- నిర్ధారించిన అటవీ అధికారులు
- భయాందోళనలో గ్రామస్థులు

బెల్లంపల్లి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని చర్లపల్లి గ్రామ సమీపంలో మంగళవారం చిరుతపులి సంచరించింది. గ్రామస్థులు చిరుతపులిని చూశామని అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఫారెస్టు రేంజ్ అధికారి పూర్ణచందర్ ఆధ్వర్యంలో అధికారులు అటవీ ప్రాంతంలో, చర్లపల్లి గ్రామ శివారులోకి వెళ్లి పరిశీలించారు. చిరుతపులి అడుగులను గుర్తించారు. చిరుతపులి చర్లపల్లి నుంచి ఎల్లారం గ్రామం వైపు వెళ్లినట్లు గుర్తించారు. దీంతో చర్లపల్లి, జన్కాపూర్, ఎల్లారం, చర్లపల్లి గ్రామం మీదుగా కన్నెపల్లి, భీమిని మండలాలకు వెళ్లే వాహనదారులు భయపడుతున్నారు. పత్తి ఏరేందుకు, పొలం పనులకు వెళ్లిన రైతులు, కూలీలు చిరుత పులి భయంతో మధ్యాహ్నమే ఇళ్లకు చేరుకున్నారు. స్థానిక గ్రామాల ప్రజలను అటవీశాఖ అధికారులు అప్రమత్తం చేశారు. సాయంత్రం 5 గంటల తర్వాత ఇళ్ల నుంచి బయటకు రావద్దని, బయటకు వెళ్లాల్సి వస్తే గుంపులుగా వెళ్లాలని సూచించారు.

ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ


ప్రజావేదికలో వివరాలు తెలుసుకుంటున్న డీఆర్‌డీవో కిషన్

నెన్నెల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పనుల్లో అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని డీఆర్‌డీవో కిషన్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సామాజిక తనిఖీ 14వ ప్రజావేదికలో మాట్లాడారు. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 డిసెంబరు 2 వరకు రూ.4.14 కోట్లతో చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. రూ.11 లక్షలు మెటీరియల్‌కు ఖర్చు, రూ. 4.01 కోట్లు కూలీ లకు వేతనాలు చెల్లించారు. పనుల్లో అవకతవకలపై సిబ్బంది ప్రజావేదికలో నివేదించారు. రూ. 3,826లు రికవరీకి ఆదేశించారు. జిల్లా అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి కిరణ్, అంబుడ్స్‌మెన్ శివరామ్, ఎస్‌టీఎం వేణు, ఎస్ఆర్‌పీ దేవేందర్, ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు అమలు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న పైళ్ల ఆశయ్య

శ్రీరాంపూర్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పైళ్ల ఆశయ్య అన్నారు. శ్రీరాంపూర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పాటు చేసి ఏడాది కావస్తున్నా హామీలు అమలు చేయడం లేదన్నారు. కార్మికులకు కనీస వేతనం అమలు, నిర్ణీత పని గంటలు, ఇతర హక్కులు హరించే ప్రయత్నం చేస్తోందన్నారు. పోడు భూములకు పట్టాలివ్వాలన్నారు. అబ్బోజు రమణ, దుంపల రంజిత్ కుమార్, దూలం శ్రీనివాస్, ప్రకాష్, శ్రీకాంత్, అభినవ్, షన్నం, చందు, పాల్గొన్నారు.

ప్రజాపాలన విజయోత్సవ ర్యాలీ



నస్పూర్‌లో ప్రజా పాలన విజయోత్సవ ర్యాలీ

నస్పూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా నస్పూర్ మున్సిపాలిటీలో మంగళవారం అధికారులు, పాఠశాలల విద్యార్థులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. రాయల్ టాకీస్ చౌరస్తా నుంచి సీసీసీ కార్నర్ వరకు ర్యాలీ సాగింది. రోడ్లపై చెత్తను వేయవద్దని, మొక్కలను నాటి పర్యావరణాన్ని కాపాడాలని నినాదాలు చేశారు. కార్నర్ వద్ద మున్సిపల్ అధికారులు, విద్యార్థులు మానవహారం నిర్వహించారు. తీగల్‌పహాడ్‌లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో మున్సిపల్ కార్మికులకు వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. పారిశుధ్య కార్మికులకు పీపీఈ కిట్స్, మాస్కులు, గ్లౌసులు, సేఫ్టీ జాకెట్స్, బూట్లు పంపిణీ చేశారు. పారిశుధ్య కార్మికులను సన్మానించి ప్రశంసా పత్రాలను అందించారు. మున్సిపల్ చైర్మన్ సురిమిల్ల వేణు, వైస్ చైర్మన్ గెల్లు రజితమల్లేష్, మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీష్, తహసీల్దార్ శ్రీనివాస్, కౌన్సిలర్లు రాజమౌళి, పూదరికుమార్, తెనుగు లావణ్యదేవేందర్, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ సమత, డాక్టర్ రుబియా, మమత, మెప్మా సిబ్బంది, వార్డు ఆఫీసర్లు, పాల్గొన్నారు.

శ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్మన్ సుర్మిళ్ల వేణు, కమిషనర్ చిట్యాల సతీష్ అన్నారు. శ్రీరాంపూర్‌లోని 6, 16, 17 వార్డులలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు.

బెల్లంపల్లి, (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం పాత మున్సిపల్ కార్యాలయం నుంచి కాంటా చౌరస్తా వరకు 2కే రన్ నిర్వహించారు. ఆర్డీవో హరికృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కులశ్వేత, కమిషనర్ శ్రీనివాస్, ఎంఈవో పోచయ్య మున్సిపల్, మెప్మా సిబ్బంది, అంగన్‌వాడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సభకు 3 వేల మంది తరలింపు

మందమర్రిటౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తవుతున్న సందర్భంగా బుధవారం పెద్దపల్లిలో జరిగే ప్రజాపాలన సంబరాలకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరు కానున్నారు. ఈ సభకు 3 వేల మంది తరలి వెళ్తున్నారు. సంబరాలకు సంబంధించి గోదావరిఖనిలో జనక్‌ప్రసాద్ సమావేశాలు నిర్వహించారు. మందమర్రి నుంచి ఐఎన్‌టీయూసీ నాయకులు తరలి రావాలని కోరారు.

స్వయం సహాయక సంఘాల ఆర్థిక బలోపేతమే లక్ష్యం

దండేపల్లి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాలను ఆర్థికంగా బలోపేతమే లక్ష్యంగా సిబ్బంది కృషి చేయాలని డీఆర్‌డీఏ డీపీఎం సంజీవ్ సూచించారు. దండేపల్లిలో ఐకేపీ కార్యాలయంలో మంగళవారం మామిడిపల్లి గ్రామానికి చెందిన వీవోఏ కొప్పుల లింగయ్య బ్యాంకు రుణాలను పూర్తి చేయడంతో అభినందించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ మహిళా సంఘాలకు రుణాలు ఇప్పించి ఆర్థిక బలోపేతానికి కృషి చేయాలన్నారు. మండల సమైఖ్య అధ్యక్షురాలు అల్లంల అనిత, కార్యదర్శి రజిత, ఐకేపీ ఏపీఎం భూపతి బ్రహ్మయ్య, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకాంతచారి వర్ధంతి

జన్నారం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జన్నారంలో మంగళవారం తెలంగాణ రాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన కాసోజు శ్రీకాంతచారి వర్ధంతిని అఖిల భారత విశ్వకర్మ సంఘం నాయకులు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీరాముల వెంకటేష్, శ్రీనివాస్, రమేష్, రామచంద్రం, మన్మథచారి, విజయ్, సత్యం, చారి, సాయి, శోభన్, శ్రీధర్, శీను తదితరులు పాల్గొన్నారు.